తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం-26- డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 208 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# 125 ఏండ్ల చర్చిలో డిప్యూటీ సీఎం



## మనుషులు ప్రేమ ఆప్యాయతతో జీవించాలని పిలుపు మధిర నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకలు

- 125 ఏళ్ల బయ్యారం చర్చి వేడుకల్లో డిప్యూటీ సీఎం పాల్గొనడం
- క్రిస్మస్ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు
- ప్రభువు చూపిన మార్గంలో మానవ సేవకు పిలుపు

**ఖమ్మం, డిసెంబరు 25 (తెలంగాణ ముచ్చట్లు):** చారిత్రాత్మకమైన ఖమ్మం జిల్లా బయ్యారం చర్చి నిర్మించి 125 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ, స్నేహితులకు, రాష్ట్ర ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆ చర్చిని సందర్శించిన


# ఔటర్ రింగ్ రోడ్ వరకు జీహెచ్ఎంసీ విస్తరణ

**జోన్లు, సర్కిల్స్ రెట్టింపు, 300 వార్డులకు ఫైనల్ నోటిఫికేషన్**

- ఔటర్ రింగ్ రోడ్ వరకు జీహెచ్ఎంసీ పరిధి విస్తరణ
- 6 జోన్ల నుంచి 12 జోన్లకు, 30 నుంచి 60 సర్కిల్స్‌కు పెంపు
- ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి సహా 6 కొత్త జోన్ల ఏర్పాటు
- 300 వార్డుల డీలిమిటేషన్‌పై ఫైనల్ నోటిఫికేషన్ విడుదల

2లో





## 370 రద్దుతో కాశ్మీర్‌లో భారత రాజ్యాంగం అమలు

- గతంలో ఒకే కుటుంబం పేరుతో పథకాలు అమలు
- లక్నో గోమతీ నదీ తీరంలో ప్రేరణాస్థల్ ప్రారంభం
- జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ

లక్నో,డిసెంబర్25(ఆర్ఎన్ఎ): ఆర్టికల్ 370 రద్దుతో శ్యామ్‌ప్రసాద్ కల సాకారం చేశామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో భారత రాజ్యాంగం అమలు చేశామని చెప్పారు. గురువారం ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గోమతీ నది ఒడ్డున నిర్మించిన రాష్ట్ర ప్రేరణా స్థల్‌ను జాతికి అంకితం చేశారు. అనంతరం బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ.. 'కోట్లాదిమందిని పేదరికం నుంచి విముక్తి చేశాం అన్నారు. గతంలో ఒకే కుటుంబం పేరుతో పథకాలు అమలుచేశారు. వాజ్‌పేయి హయాంలోనే గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి బీజం పడిరది.



## అన్ని మతాలను గౌరవించటమే మా పార్టీ విధానం

- జీసస్ జీవితం మానవాళికి గొప్ప సందేశం
- క్రిస్మస్ వేడుకల్లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు):** అన్ని మతాలను గౌరవించటం, అందర్నీ సమానంగా చూడటమే తమ పార్టీ విధానమని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. మతాలను కించపరిచే చర్యలకు అవకాశం లేకుండా తమ ప్రభుత్వం త్వరలోనే కఠినమైన చట్టం

మిగతా 2లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

- నిందితులందరినీ పిలిచి విచారించిన సిట్
- పెన్‌డ్రైవ్ డేటా ఆధారంగా ప్రశ్నల వర్షం

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితులందరినీ సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్‌రావు, తిరుపతన్నలను పిలిచిన సిట్.. వారిని విచారించింది. ఎస్ఐబీ మాజీ చీఫ్

మిగతా 2లో



## నగరంలో విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్‌లు

**తాగి వాహనాలు నడపరాదని పోలీసుల హెచ్చరిక**

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు ప్రారంభించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు.

మిగతా 2లో





## కిటకిటలాడుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్

- పెద్ద ఎత్తున తరలొచ్చిన పుస్తక ప్రియులు

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ బుక్ ఫెయిర్ జనంతో కిటకిటలాడుతోంది. నగరంలోని ఇందిరాపార్కు వద్ద గల ఎన్టీఆర్ స్టేడియంలో గత ఆదివారం నుంచి బుక్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే మిగతా రోజులతో పోలిస్తే క్రిస్మస్ సందర్భంగా గురువారం సెలవు కాబట్టి జనం కిక్కిరిసిపోయారు. పెద్దలు, పిల్లలు పుస్తకాలను ఆసక్తిగా తిలకించి, కొనుగోలు చేశారు. అనిశెట్టి రజిత వేదిక వద్ద నిర్వహిస్తున్న పుస్తకావిష్కరణలు, పిల్లల నృత్యాలు, చర్చగోష్టులు ఆకట్టుకుంటూ ఆలోచింపజేస్తున్నాయి. శుక్రవారం కూడా సెలవుదినం కాబట్టి.. పుస్తక ప్రియులు పెద్ద ఎత్తున తరలొచ్చే అవకాశముంది. కాగా ఈనెల 29 వరకు ఈ బుక్ ఫెయిర్ కొనసాగనుంది.



## విద్యార్థులకు తిండిపెట్టలేని స్థితిలో ప్రభుత్వం

**మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం**

**సిద్దిపేట,డిసెంబర్25(తెలంగాణ ముచ్చట్లు):** అనాథ విద్యార్థులకు తిండిపెట్టలేని స్థితిలో ఈ దరిద్రపుగొట్టు ప్రభుత్వం ఉన్నదని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా సిద్ధిపేటలో ఆనాథ విద్యార్థులతో మాట్లాడేందుకు హరీశ్‌రావు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంపై విమర్శలు వర్షం గుప్పించారు. గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల విద్యార్థుల మెస్ బిల్లులు,

మిగతా 8లో

## నల్గొండ జిల్లా బీజేపీలో భగ్గుమన్న విభేదాలు

- సర్పంచ్‌లకు సన్మానం విషయంలో వివాదం
- పరస్పరం దాడులకు తెగించిన ఇరు వర్గాలు

**నల్గొండ,డిసెంబర్25(తెలంగాణ ముచ్చట్లు):** నల్గొండ జిల్లాలో బీజేపీ లో విభేదాలు భగ్గుమన్నాయి. రెండు వర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. జిల్లాలో పార్టీ తరపున గెలిచిన 17 మంది సర్పంచ్‌లకు సన్మానం చేసే విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు



## అంతరాలు సృష్టించిన మనుస్మృతిని అంతం చేయాలి

- అసమానతలను స్థిరపర్చడమే ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానంసమానత్వ సమజం కోసం యువతరం పోరాడాలి
- మనుస్మృతి దహన కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు జీ రాములు, టి సాగర్



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# 125 ఏండ్ల చర్చిలో డిప్యూటీ సీఎం

(మొదటి పేజీ తరువాయి)



ఆయన మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బయ్యారం చర్చ్ కు రావడం ఫాదర్ తో ప్రార్థనలు చేయించుకొని కేవలం మధిర నియోజకవర్గం లోని కుటుంబాలకే కాకుండా రాష్ట్రం మరియు దేశంలోని అన్ని కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధానంగా మానవ మనుగడకు ప్రపంచవ్యాప్తంగా సహజీవనంతో జీవించేలా తద్వారా మానవ మనుగడకు మనం అంతా ప్రేమతో ఆప్యాయతో బతికేలా ఉండాలని ప్రతి సంవత్సరం ఈ చర్చి నుంచి ప్రభువును ప్రార్థిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ప్రభువు ఆశీర్వాదాలు ఉండాలని మంచి జరగాలని, కుటుంబాలు బాగా ఎదిగి పిల్లలు మంచిగా చదువుకొని ఎదగాలని ఫాదర్ తో ప్రార్థన చేయించుకుని ఇక్కడి నుంచి బయలుదేరుతాం. కేవలం ప్రార్థనలు చేయించుకుని బయలుదేయటమే కాదు ప్రభువు ఏ సందేశాన్ని అయితే మానవాళికి అందించారూ ఇతరుల కోసం, వారి ఇబ్బందుల నుంచి బయటపడేయడం కోసం ఎలా జీవించాలో ప్రభువు జీవితం మనకు నేర్పిస్తుంది అన్నారు. ఒకరికి మరొకరు సహాయ సహకారాలతో జీవించేందుకు ప్రభువు ఆశీస్సులు మనందరిపై ఉండాలని ప్రభువును ప్రార్థిస్తున్నాను అన్నారు. ప్రజలందరి యోగ క్షేమాల కోసం ఈ అధికారం ఉపయోగపడే విధంగా మన ఆలోచనలు మనం మార్గం ఉండేటట్టుగా ప్రభువు మనల్ని నడిపించాలని ఆ ప్రభువును కోరుకుంటున్నానని తెలిపారు. ప్రభువు చూపించిన మార్గంలో పయనిస్తూ తోటి వారి కోసం పనిచేద్దామని మరోసారి ఎంతో చారిత్రాత్మకమైన ఈ బయ్యారం చర్చి నుంచి 125 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఎంతో వైభవంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారని తెలుసుకొని ఆ వేడుకలు వైభవంగా జరగాలని ప్రపంచవ్యాప్తంగా శాంతి సందేశం వెళ్లేలా ఉత్సవాలు భారీగా ఉండాలని తాను కోరుకుంటున్నాను. బయ్యారంలో అభివృద్ధి కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం భగవంతుడు నిండుగా మనకు శక్తిని ఇవ్వాలని ఆయన శక్తితో వచ్చే అధికారం హోదాతో కూడా ప్రజా సంక్షేమ కోసం ఉపయోగపడేట్టుగా మన ఆలోచనలు మన మార్గాన్ని నడిపించే విధంగా వారు ఆశీర్వదిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటూ అందరికీ రాబోయే రోజుల్లో మంచి జరగాలని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# ఔటర్ రింగ్ రోడ్ వరకు జీహెచ్ఎంసీ విస్తరణ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):



జీహెచ్ఎంసీపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ పరిధిని ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించడంతో పాటు, జోన్లు సర్కిల్స్ సంఖ్యను పెంచుతూ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఇప్పటి వరకు ఉన్న 6 జోన్లను 12కు పెంచుతూ, 30 సర్కిల్స్‌ను 60కు పెంచినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కొత్తగా ఏర్పాటైన జోన్లలో ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, శంషాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్ ఉన్నాయి. ఈ కొత్త జోన్లలో ప్రత్యేక జోనల్ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే, వార్డు ఆఫీసుల్లో కొత్త సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటవుతాయి. త్వరలోనే ఈ కొత్త జోనల్, సర్కిల్ కార్యాలయాల ద్వారా పరిపాలన కొనసాగనుంది.

జీహెచ్ఎంసీ వార్డుల డీ లిమిటేషన్‌పై కూడా ప్రభుత్వం ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 300 వార్డులు ఖరారు చేశారు. ఈ నెల 9న ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు, పదిరోజుల పాటు ప్రజల అభ్యంతరాలను స్వీకరించారు. ఈ సమయంలో 6 వేలకు పైగా అభ్యంతరాలు అందాయి. వాటిలో సహేతుకమైన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, ఈరోజు ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నిర్ణయంతో పరిధిలో పరిపాలన మరింత విస్తృతమవుతుంది. ప్రజలకు సమీపంలోనే జోనల్, సర్కిల్ కార్యాలయాలు ఉండటం వల్ల స్థానిక సమస్యలు త్వరగా పరిష్కారం కానున్నాయి. కొత్త వార్డుల ఏర్పాటుతో ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అన్ని మతాలను గౌరవించటమే

# మా పార్టీ విధానం

(మొదటి పేజీ తరువాయి)



తీసుకురాబోతోందని ఆయన వెల్లడించారు. గురువారం హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మహేశ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రైస్తవ సోదర సోదరీమణులకు హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జీసస్ క్రైస్తవులకు మాత్రమే కాదు, యావత్ ప్రపంచానికి దేవుడని పేర్కొన్నారు. దేశంలో ప్రతి పౌరుడికి తన మతాన్ని, తన దేవుడిని ప్రార్థించే సంపూర్ణ స్వేచ్ఛ ఉందన్నారు. చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం నేటి యువతకు ఉందని తెలిపారు. మానవాళి ఉన్నంతకాలం జీసస్ ప్రజల హృదయాల్లో నిలిచే ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ సంపంత్ కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, ఇందిరా, పాస్టర్ బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

# 370 రద్దుతో కాశ్మీర్‌లో భారత రాజ్యాంగం అమలు

(మొదటి పేజీ తరువాయి)

2014 నుంచి గ్రామాల్లో 4 లక్షల కి.మీ. రోడ్ల నిర్మాణం జరిగింది. దేశంలో ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం మరింత పుంజుకుంది. వాజ్‌పేయి హయాంలోనే ఢల్లీ మెట్రో ప్రారంభమైంది. భవిష్యత్‌లో అతిపెద్ద మొబైల్ ఫోన్ల ఉత్పత్తి దేశంగా భారత్ మారనుందని అన్నారు. అందరి కృషితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుంది. లక్నోలో అతిపెద్ద డిఫెన్స్ కారిడార్ ఉంది. బ్రహ్మోస్ క్షిపణులు లక్నోలోనే తయారవుతున్నాయని అంటూ... మన బ్రహ్మోస్ క్షిపణుల సామర్థ్యం ప్రపంచమంతా చూసిందని అన్నారు. మొబైల్, ఇంటర్నెట్ వినియోగించే దేశాల్లో భారత్‌దే అగ్రస్థానం' అని అన్నారు. కాగా, సుమారు 65 ఎకరాల విస్తీర్ణంలో 230 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మితమైన రాష్ట్ర ప్రేరణా స్థల్ జాతీయ స్మారక సముదాయంలో అటల్ బిహారీ వాజ్‌పేయితో పాటు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయల ఆదర్శాలకు అనుగుణంగా వారి విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఎం యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనంద్ బెన్ తదితరులు పాల్గొన్నారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం


(మొదటి పేజీ తరువాయి)



ప్రభాకర్ రావు విచారణ గురువారంతో ముగియనుండటంతో అందిరితో కలిపి దర్యాప్తు చేస్తోంది సిట్. అందులోభాగంగా ఇప్పటికే సిట్ అధికారి రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఆఫీసుకు చేరుకున్నారు. ప్రభాకర్ రావు 14 రోజుల విచారణ ముగియనుండగా.. శుక్రవారం 10 గంటలకు పోలీస్ కస్టడీ నుంచి విడుదల కానున్నారు. అయితే.. 14 రోజుల కస్టడీలో ప్రభాకర్‌రావు ఏం చెప్పారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అనేక ప్రశ్నలకు ఎస్ఐబీ మాజీ చీఫ్ సమాధానం చెప్పనట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి పెన్ డ్రైవ్‌ను సిట్ అధికారులు కీలక ఆధారంగా భావించారు. ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా పని చేసిన కాలంలో పెన్ డ్రైవ్‌లో ట్యాపింగ్ వివరాలు స్టోర్ చేసినట్లు సిట్ గుర్తించింది. ఈ పెన్ డ్రైవ్ డేటాను ప్రభాకర్ రావు ముందు పెట్టి మరీ విచారించింది సిట్. అయితే 6 వేల ఫోన్ నెంబర్లు ఉన్నప్పటికీ పెన్‌డ్రైవ్‌పై ప్రభాకర్ రావు ఎలాంటి జవాబు ఇవ్వనట్లు సమాచారం.

# నగరంలో విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్‌లు

(మొదటి పేజీ తరువాయి)



బుధవారం ప్రారంభమైన ఈ తనిఖీలు డిసెంబర్ 31వ తేదీ వరకు కొనసాగనున్నాయి. వరుసగా రెండోరోజూ తనిఖీలు చేపట్టారు. ఓఆర్ఆర్‌పైనా తనిఖీలకు సిద్ధమయ్యారు.

నగరంలో 120 ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు ఉంటాయని హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. బుధవారమే డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలో 304 మందిని పట్టుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన 304 మంది వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో నగర వాసులకు పలు సూచనలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా, పది వేల రూపాయల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం పబ్‌లకు వెళ్లే వారు తమ డ్రైవర్లను వెంట తీసుకెళ్లాలని కమిషనర్ తెలిపారు. లేదంటే క్యాబ్ బుక్ చేసుకుని ప్రయాణించాలని సూచించారు. సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా సెలబ్రేషన్స్ చేసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# అంతరాలు సృష్టించిన మనుస్మృతిని అంతం చేయాలి



హైదరాబాద్ (డిసెంబరు 25)... మనుషుల మధ్య అసమానతలు సృష్టించిన మనుస్మృతిని మట్టిలో పాతిపెట్టాలని కేవీపీఎస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు జీ రాములు, టి సాగర్ పిలుపునిచ్చారు. అసమానతలను స్థిరపరచడమే ఆర్ ఎస్ ఎస్, బీజేపీ విధానమని వారు స్పష్టం చేశారు. సామాజిక సమానత్వం కోసం యువతరం పోరాడాలని విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్ లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో మనుస్మృతి దహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మనుస్మృతి కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా రాములు, సాగర్ మాట్లాడుతూ మనుస్మృతి ని మట్టుపెట్టకపోతే మరో వెయ్యి ఏళ్లయిన దేశ ప్రజల మధ్య ఐక్యత అసాధ్యమని చెప్పారు. ఆర్ ఎస్ ఎస్ , బీజేపీ విధానాలవల్ల అసమానతలు స్థిరపరచబడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మనుషుల మధ్య అంతరాలకు మూలమైన మనుస్మృతి మనుషుల మెదళ్లలో ఇంకిపోయి ఉందన్నారు. నరనరాన ప్రవహిస్తున్న మనువాదాన్ని పారద్రోలాలని సూచించారు. తల్లి గర్భం నుండి మనుషులందరూ జన్మిస్తారని, కానీ ఆర్ ఎస్ ఎస్ అసమానతలను స్థిరపరచడానికి చాతుర్వర్ణ వ్యవస్థను సమాజంపై రుద్దిందన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థను దోపిడీ సాధనంగా పేదల ఐక్యతకు ఆటంకంగా అది కొనసాగిస్తోంద

# నల్గొండ జిల్లా బీజేపీలో భగ్గుమన్న విభేదాలు

దారి తీసింది. ఈ క్రమంలో బీజేపీ నేత పిల్లి రామరాజుపై ఓ వర్గం దాడి చేసింది. దాంతో జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డిపై మరో వర్గం దాడికి పాల్పడిరది. ఈ ఘర్షణ గురించి తెలిసి బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అదేవిధంగా పోలీసులు కూడా అక్కడ భారీగా మోహరించారు. మరోవైపు ఈ కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్ల కెమెరాలను కొందరు నేతలు లాక్కుని డేటాను డిలీట్ చేశారు. అందుకు నిరసనగా జర్నలిస్టులు బీజేపీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ క్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు క్షమాపణ చెప్పడంతో జర్నలిస్టులు ఆందోళన విరమించారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# బేతల్ గోస్పాల్ చర్చ్‌లో ఘనంగా క్రిస్మస్ ఉత్సవాలు




**ఏ ఎస్ రావు నగర్, డిసెంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకుని బేతల్ గోస్పాల్ చర్చ్‌లో పాస్టర్ సురపనేని ప్రభు ప్రసాద్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు హాజరయ్యారు.ఈ సందర్భంగా వేణుగోపాల చారి మాట్లాడుతూ, సర్వ మానవాళి పాపాలను కడగడానికి దేవుని రూపంలో జన్మించిన యేసుక్రీస్తు ప్రేమ, క్షమ, త్యాగాలకు ప్రతీక అని అన్నారు. యేసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి మార్గదర్శకమని, ప్రతి ఒక్కరూ సర్వ జీవులను ప్రేమతో చూడాలని ఆయన పిలుపునిచ్చారు.క్రిస్మస్ సందర్భంగా చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థనలు, కీర్తనలు నిర్వహించగా, పరిసర ప్రాంతాలు పండుగ వాతావరణంతో కళకళలాడాయి.ఈ కార్యక్రమాల్లో సూరపనేని అనుప్, నాదెండ్ల భాస్కరరావు, శంకర్ రావు, అలాగే వివిధ కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.క్రిస్మస్ ఉత్సవాలు ఆనందోత్సాహాలు, ఆధ్యాత్మిక సందేశాలతో విజయవంతంగా ముగిశాయి.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలతో మనుస్మృతి దహన కార్యక్రమం

**ఏ ఎస్ రావునగర్, డిసెంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం ఈసీఐఎల్ చౌరస్తా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మనుస్మృతి దహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 1927లో డిసెంబర్ 25న మనుస్మృతిని సామూహికంగా దహనం చేసి, భారతదేశంలో కులవాదంపై పోరాటానికి పునాదులు వేశారు. మనుషులను సమానంగా చూడకపోవడాన్ని నిరసిస్తూ, మనువాద ప్రతులను తగలబెట్టిన ఆయన దళిత, నిర్లక్ష్యిత వర్గాల హక్కుల కోసం స్ఫూర్తిదాయకంగా నిలిచారు.ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. సామాజిక ఉద్యమ నాయకులు పి. మల్లేశం మాట్లాడుతూ, "భారత రాజ్యాంగం




అందరికీ సమాన హక్కులను కల్పించినప్పటికీ, నేటి పాలకులు మనువాదాన్ని తిరిగి స్థాపించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రజలు దీనికి వ్యతిరేకంగా గట్టిగా ఆవాజ్ వేయాలి" అన్నారు. సామాజిక నాయకులు జయరాజు, గుమ్మడి హరి ప్రసాద్, శివన్నారాయణ, గొడుగు యాదగిరిరావు ప్రసంగించారు. అనంతరం మనుస్మృతి ప్రతులను తగలబెట్టి, "మనువాదం నశించాలి, భారత రాజ్యాంగాన్ని కాపాడాలి" అనే నినాదాలు వినిపించాయి.ఈ కార్యక్రమంలో బాలు, గిరీష్, ఎం. భాస్కర్ రావు, పి. మల్లేశం, గుమ్మడి హరి ప్రసాద్, జయరాజ్, శివన్నారాయణ, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**కాప్రా, డిసెంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ మీర్‌పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక చర్చ్‌ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, సేవాతత్పరత, క్షమాగుణాలను బోధించిన యేసు క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత ఆనందకరమైన రోజు అని అన్నారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో క్రిస్మస్ వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. యేసు క్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరికీ లభించి, అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ప్రార్థించారు .ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, పాస్టర్ సోదరులు తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి వేడుకలు




**ధర్మసాగర్,డిసెంబర్25(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామంలో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి వేడుకలను భారతీయ జనతా పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి వాజ్‌పేయికి ఘన నివాళులు అర్పించారు.


ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో వాజ్‌పేయి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన చూపిన పాలనా దార్శనికత నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. జాతీయ ఐక్యత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో వాజ్‌పేయి చేసిన కృషిని వారు గుర్తు చేశారు. ఈ వేడుకల్లో పెసరు వెంకటేష్, ననుబాల కుమారస్వామి, హరిష్, వెంకటేష్, శివ, బిక్షపతి, సర్వేశ్, ప్రసాద్, వెంకటస్వామి, రాజు, రాజు, రాకేష్, సంజీవ్, మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# భవానీ నగర్‌లో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం



**నాచారం, డిసెంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ నాచారం డివిజన్ లో భవానీ నగర్ వీధి నెంబర్-2లో కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 25వ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి భక్తి మార్గం సమాజానికి శాంతి, క్రమశిక్షణ, ఐక్యతను అందిస్తుందన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజిక సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, మోహన్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# మౌంట్ జియన్ మినిస్ట్రీస్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**కాప్రా, డిసెంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ మీర్పేట్ హెచ్ బి కాలనీ ఇంద్రానగర్ కాలనీ ఫేజ్-2 లోని మౌంట్ జియన్ మినిస్ట్రీస్ లో క్రిస్మస్ ఆరాధన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కాపరి రెవ. కె. ఊర్మిళ ఆనంద్ ఏసుక్రీస్తు పవిత్ర జననం, ఆయన బోధించిన ప్రేమ, శాంతి, క్షమ అనే విలువలపై సందేశం అందించారు.ఈకార్యక్రమంలో చిన్నారులు క్రిస్మస్ పాటలతో దేవుణ్ని ఆరాధించగా, యువకులు నృత్యాలు, గీతాల ద్వారా తమ భక్తిని వ్యక్తం చేశారు. సంఘ సభ్యులు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరాధనలో భాగమయ్యారు.ఆరాధన అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి, పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ వేడుకలు ఆనందోత్సాహాలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో సాగాయి.

## మల్లాపూర్ డివిజన్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు




**మల్లాపూర్, డిసెంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలో బీర్షెబా చర్చి ఆధ్వర్యంలో స్వాగత్ కన్వెన్షన్‌లో క్రిస్మస్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్రిస్టియన్ సోదర సోదరీమణులతో కలిసి ఎమ్మెల్యే, కార్పొరేటర్ కేక్ కట్ చేసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం వేదికపై నుంచి డివిజన్ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను అందరూ సుఖసంతోషాలతో, శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.అలాగే మల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివిధ చర్చిల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ రంగారావు, వివి రావు, ఫైళ్ల ప్రవీణ్ కుమార్, పద్మ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ముత్యాలు, శ్రీశైలం, కుందన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి



**ఉప్పల్, డిసెంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ డివిజన్ పరిధిలోని చేర్చి కాలనీలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చర్చ్‌ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి మానవుడిలో ప్రేమ, క్షమాగుణాలు పెంపొందాలనే యేసుక్రీస్తు బోధనలు నిత్యం ఆచరణీయమని అన్నారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందాన్ని నింపిన యేసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. విశ్వ మానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు నింపిన కరుణామయుడు యేసుక్రీస్తు ప్రభువని అన్నారు.శాంతియుత సమాజ స్థాపన కోసం తన రక్తాన్ని చిందించిన ధీశాలి యేసుక్రీస్తు అని కొనియాడారు. యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రిస్మస్ పర్వదినాన్ని ఉప్పల్ ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# వెల్టూర్‌లో క్రిస్మస్ సందర్భంగా చర్చ్‌కు కుర్చీలు విరాళం

**క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు**

- **మాజీ జెడ్పీటిసి రఘుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ అశోక్**

**పెద్దమందడి,డిసెంబర్25(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొదటగా మాజీ జడ్పీటిసి రఘుపతి రెడ్డి క్రైస్తవ సోదరులను ఉద్దేశించి మాట్లాడారు. క్రిస్మస్ పండుగ త్యాగం, సేవ, మానవత్వాన్ని బోధిస్తుందని ఆయన అన్నారు. గ్రామాభివృద్ధితో పాటు మత సామరస్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వెల్టూర్ గ్రామంలో అన్ని మతాలు కలిసికట్టుగా పండుగలు జరుపుకోవడం గర్వకారణమని తెలిపారు. క్రైస్తవ సోదరులు ఆరోగ్యంగా, ఆనందంగా క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగ సందర్భంగా మన చర్చ్‌కు 25 కుర్చీలను విరాళంగా అందజేయడం ఆనందంగా ఉందని తెలిపారు. కాలనీ యువతతో కలిసి ఈ కుర్చీలు అందజేయడం జరిగిందని చెప్పారు.గ్రామంలో ఏ మతానికి సంబంధించిన కార్యక్రమమైనా గ్రామపంచాయతీ తరపున సహకారం ఉంటుందని, అవసరమైనప్పుడు ప్రతి వర్గానికి అండగా నిలబడతామని సర్పంచ్ అశోక్ భరోసా ఇచ్చారు.అలాగే చర్చికి కావలసిన ప్రహరీ గోడ నిర్మాణం, పై కప్పు, అదనపు గది వంటి వసతులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. క్రైస్తవ సోదరులు సుఖసంతోషాలతో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆహ్వానం మేరకు వెంటనే స్పందించి కార్యక్రమానికి హాజరైన గ్రామ సర్పంచ్ అశోక్, మాజీ జడ్పీటిసి రఘుపతి రెడ్డి, అలాగే గ్రామ పెద్దలకు యేసు ప్రభువు దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తూ పాస్టర్ సురేష్ కుమార్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి రఘుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్ అశోక్, హంసు వర్మ, ఆర్ పెద్ద శ్రీనివాస్ రెడ్డి, వడ్డే శేఖర్, నాగభూషణ్, పట్నం సత్యన్న, ఇరికిశెట్టి మధు, దయ్యాల అశోక్,అంజి, దయల రమేష్, దేవదానం, శ్యాంసుందర్, గుండెల సుభాష్ బండి చంద్రన్న, పట్నం దశరథ,గ్రామ పెద్దలు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

# నమాజ్: దైవ సామీప్యానికి సోపానం.. నిరీక్షణలోనూ పుణ్యఫలం!

- **ముహమ్మద్ ముజాహిద్**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు):** నమాజ్: కన్నీటి ప్రార్థనలో దైవ దర్శనం "అలసిపోయిన గుండెకు ఉపశమనం ఎక్కడ? అశాంతిగా ఉన్న ప్రాణానికి ఓదార్పు ఎక్కడ? అల్లాహ్ ముందు తలవంచి సాష్టాంగపడే 'సజ్దా'లో తప్ప! నమాజ్ అనేది మనిషి తన సృష్టికర్త చెంత వాలిపోయే ఒక అపురూపమైన ఆలింగనం. ఆ నిశ్శబ్ద సమయంలో, పెదవులు కదలకపోయినా హృదయం చేసే ఆక్రందనను, మనం చిందించే ప్రతి కన్నీటి చుక్కను వినేది ఆ పరమాత్ముడు ఒక్కడే.

మసీదు ద్వారం దగ్గర నిలబడి నమాజ్ కోసం వేచి చూస్తుంటే... అది ఒక యాచకుడు తన యజమాని కోసం చూసే నిరీక్షణ కాదు, ఒక పసిబిడ్డ తన తల్లి ఒడి కోసం తపించే ఆర్తి. ఆ నిరీక్షణలో ప్రతి క్షణం ఒక ధ్యానం, ప్రతి శ్వాస ఒక ఆరాధన. లోకం మనల్ని మర్చిపోయినా, మనం అల్లాహ్ కోసం వేచి చూస్తున్న ఆ క్షణాలను ఆయన మర్చిపోడు.

లోకమంతా నిద్రపోతున్న వేళ, నిశ్శబ్దమైన రాత్రిలో ఎవరూ చూడని సమయంలో.. కేవలం 'ఆయన' కోసం వణికే హృదయంతో చేసే ప్రార్థన ఉందే, అది మనిషికి, దైవానికి మధ్య ఉన్న రహస్య ప్రేమకావ్యం. ఫజ్ర్ వేళ చల్లని గాలిలో దైవ పిలుపు విని అడుగులు వేస్తుంటే, ఆ పాదాలకు తగిలే ధూళి కూడా పుణ్యతీర్థమై మారుతుంది. ఇది కేవలం విధి కాదు, ఇది ప్రాణం తన మూలాన్ని వెతుక్కుంటూ సాగించే ఒక భావోద్వేగ యాత్ర!"

జీవితంలో మనం దేని కోసం ఎదురుచూస్తున్నాం అనేదే మన వ్యక్తిత్వాన్ని నిర్ణయిస్తుంది. ఒక విశ్వాసి జీవితంలో అన్నిటికంటే అత్యున్నతమైన క్షణం ఏదైనా ఉందంటే, అది తన సృష్టికర్త అయిన అల్లాహ్ ముందు తలవంచి 'నమాజ్' చేసే సమయమే. నమాజ్ అనేది కేవలం ఒక ఆచారం కాదు; అది ఆత్మను శుద్ధి చేసే ఒక అద్భుత ప్రక్రియ.

కాలం విలువ నమాజ్ ప్రాముఖ్యత

నిర్ణీత వేళల్లో నమాజ్ చేయడం అల్లాహ్‌కు అత్యంత ప్రీతికరమైన కార్యం. సమయపాలన లేని జీవితం గమ్యం లేని ప్రయాణం వంటిది. నమాజ్‌ను ఆలస్యం చేయడం వల్ల మనిషిలో సోమరితనం పెరుగుతుంది, అది క్రమంగా విశ్వాసాన్నే బలహీనపరుస్తుంది. దైవ ప్రవక్త (సల్లం) హెచ్చరించినట్లుగా—"మనకు, ఇతరులకు మధ్య ఉన్న గీటురాయి నమాజ్." దీనిని విస్మరించడం అంటే దైవ మార్గానికి దూరం కావడమే.

నిరీక్షణలోనూ నిగూఢమైన పుణ్యం

మనం మసీదుకు వెళ్లి, ఇమామ్ గారి కోసం లేదా సామూహిక నమాజ్ ప్రారంభం కోసం వేచి చూస్తుంటాం. ఆ నిరీక్షణ వృథా పోదు! నమాజ్ కోసం ఎదురుచూసే ప్రతి క్షణం కూడా నమాజ్ చేస్తున్న పుణ్యంతో సమానమని ప్రవక్త (సల్లం) బోధించారు. అంటే, అల్లాహ్ స్మరణలో గడిపే ఆ నిరీక్షణ కూడా ఒక ఆరాధనే.

సామూహిక ప్రార్థన: ఐక్యతకు చిహ్నం

ఒంటరిగా చేసుకునే నమాజ్ కంటే, సామూహికంగా (జమాత్) చేసే నమాజ్ 27 రెట్లు ఎక్కువ శ్రేష్ఠమైనది.

క్రమశిక్షణ: నమాజ్ పంక్తులను తిన్నగా ఉంచడం నమాజ్ స్థాపనలో ఒక ముఖ్య భాగం. ఇది ముస్లింలలో ఐక్యతను, క్రమశిక్షణను పెంచుతుంది.

ముందు వరుస: ఎప్పుడూ మొదటి వరుసలో ఉండటానికి ప్రయత్నించాలి, అది అల్లాహ్ పట్ల మనకున్న ఆరాటాన్ని తెలుపుతుంది.

రాత్రి వేళల మహిమ

పగలు మనల్ని ప్రపంచం చూస్తుంది, కానీ రాత్రి వేళ మనం అల్లాహ్‌ను చూస్తాం.

ఇషా & ఫజ్ర్: ఇషా నమాజ్‌ను సామూహికంగా చదివితే అర్ధరాత్రి వరకు ఆరాధన చేసినట్లు, ఫజ్ర్ నమాజ్‌ను సామూహికంగా చదివితే రాత్రంతా ఆరాధనలో గడిపినట్లు పుణ్యం దక్కుతుంది.

నఫిల్ నమాజ్: నిశ్శబ్దంగా ఉండే రాత్రి వేళల్లో ఏకాంతంగా, భక్తిశ్రద్ధలతో చేసే నఫిల్ నమాజులు మన అవసరాలను అల్లాహ్‌కు నివేదించుకోవడానికి అత్యంత అనువైన సమయం.

ముగింపు

ముఖ్యంగా పవిత్ర రంజాన్ మాసంలో విశ్వాసంతో నమాజ్ చేసేవారి గత పాపాలన్నీ మన్నించబడతాయని శుభవార్త ఉంది. నమాజ్ మనల్ని సోమరితనం నుండి రక్షిస్తుంది, క్రమశిక్షణను నేర్పుతుంది మరియు చివరికి మనల్ని సృష్టికర్తకు చేరువ చేస్తుంది. గుర్తుంచుకోండి: మీరు నమాజ్ కోసం అడుగులు వేస్తుంటే, అల్లాహ్ మీ వైపు తన కరుణను కురిపిస్తున్నాడని అర్థం. ఈ రోజే, ఈ క్షణమే మీ నమాజ్‌లో నిలకడను పెంచుకోండి!



# బిషప్ హౌస్‌లో క్రిస్మస్ సంబరం..

**సామాజిక సామరస్యానికి విందు వేదిక!**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు):** ప్రేమ, కరుణల ప్రతిరూపం ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని కరుణగిరి బిషప్ హౌస్ గురువారం రాత్రి ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలు, తేనీటి విందు సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. ఈ వేడుకల్లో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. బిషప్ , ఇతర క్రైస్తవ మత పెద్దలతో కలిసి ఆయన కేక్ కట్ చేసి పండుగ సంబరాలను పంచుకున్నారు. అనంతరం దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. లోక రక్షకుడైన క్రీస్తు చూపిన శాంతి మార్గం సర్వమానవాళికి ఆదర్శమని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తరపున క్రైస్తవ సోదరులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

సందడిగా బిషప్ హౌస్

విద్యుత్ దీపాల అలంకరణలు, క్రిస్మస్ కేరల్స్ మధ్య బిషప్ హౌస్ ప్రాంగణం కోలాహలంగా మారింది. ఈ తేనీటి విందులో పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు పాల్గొని ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పరస్పర ఆలింగనాలతో, చిరునవ్వులతో సాగిన ఈ వేడుక కరుణగిరిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# ఏసు బోధనలు ప్రపంచానికి మార్గదర్శకం

**పెద్దమందడి మాజీ జెడ్పీటిసి రఘుపతి రెడ్డి**

**పెద్దమందడి,డిసెంబర్25(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి రఘుపతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రతీక అని అన్నారు. ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని, వాటిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. పరస్పర సహకారం, సహనం, సోదర భావంతో జీవించడమే క్రిస్మస్ పండుగ ప్రధాన సందేశమని తెలిపారు.

సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో కలిసి ముందుకు సాగాలని, ఏసుప్రభు ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, ఆర్ పెద్ద శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు వడ్డే శేఖర్, నాగభూషణ్, పట్నం సత్యన్న, దయ్యాల దానయ్య, క్రైస్తవ సోదరీ, సోదరీమణులు పాల్గొన్నారు.

# పొన్నకల్ నూతన సర్పంచ్ మైమూద్‌ను సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు



**అడ్డాకల్,డిసెంబర్25(తెలంగాణ ముచ్చట్లు):** అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో పోటీ చేసిన సర్పంచ్ అభ్యర్థి పొన్నకల్ మైమూద్ (తెలంగాణ ఉద్యమకారుడు)ను గ్రామ ప్రజలు అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించారు. ఈ సందర్భంగా ఆయన స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా బలీదు పల్లి, వెలటూర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మైమూద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దయాకర్, మల్లక్ సురేష్ కుమార్ (వెలటూర్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు), నాయకులు శ్రీధర్ యాదవ్, మంగరాయి వెంకటేష్, వంకని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# చర్చి ఫాదర్‌ను సన్మానించిన ముస్లిం వార్డ్ నెంబర్



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 25(తెలంగాణ ముచ్చట్లు):** క్రిస్మస్ పండుగ సందర్భంగా తిమ్మినేని పాలెం గ్రామంలో 3వ వార్డు నెంబర్ షేక్ మీరా సాహెబ్ కుటుంబ సమేతంగా దేవుని సన్నిధిలో ప్రార్థనలో పాల్గొని చర్చి ఫాదర్ రఫాయల్, ఉపదేశి మాస్టర్ చాపలమడుగు రాజు ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచుతూ దేవుని ప్రేమ కృపా కరుణ శాంతి సేవాభావం అందరికీ కలగాలని ఈ పండుగ క్రైస్తవ సోదరుల కుటుంబాలలో కొత్త వెలుగులు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ క్రిస్టియన్స్ సోదరి సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# కలిసి పని చేద్దాం.. జెండా ఎగరేద్దాం



- **బేషీజాలు వద్దు... పార్టీ పటిష్టతనే ముద్దు**
- **డిసిసి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,డిసెంబర్25(తెలంగాణ ముచ్చట్లు):** గురువారం వనపర్తి జిల్లాలో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ డిసిసి అధ్యక్షుడు కొత్త కాపు శివసేన రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం నూతన డీసీసీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇందిరాపార్క్, రాజీవ్ చౌరస్తా మీదుగా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుని మాజీ రాజ్యసభ సభ్యులు హనుమంతరావుతో కలిసి డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆప్కారి శాఖ జూపల్లి కృష్ణారావు , రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి , ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని వ్యాఖ్యానించారు. కుటుంబ కుమ్ములాటలతో ఆ పార్టీ పూర్తిగా కూలిపోవడం ఖాయమని అన్నారు. అలాంటి పరిస్థితిలో ఉన్న పార్టీ నాయకులు కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో కమిషన్ల కోసమే పనులు చేసి మధ్యలో వదిలేసిన వారు, నేడు అదే ప్రాజెక్టుపై మాట్లాడటం విడ్డూరమన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులకు బొక్కలు పెట్టి, మేమే నీరు తెచ్చామని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు.పదేళ్ల కాలంలో ప్రజల సమస్యలను పట్టించుకోని పాలనకు భిన్నంగా, ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ వారి కలను నెరవేరుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని స్పష్టం చేశారు.రానున్న ఎన్నికలు ఏవైనా సరే కాంగ్రెస్ పార్టీ జెండానే ఎగిరేలా అందరం కలిసికట్టుగా పని చేయాలని, పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, పెద్దలు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మణిగిల్ల గ్రామంలో పైప్‌లైన్ లీకేజీకి తక్షణ చర్యలు



◆ గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్


**పెద్దమందడి,డిసెంబర్25(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలోని వెంకన్న చెరువు వెనుక ఉన్న మంచినీటి బోరు పైప్‌లైన్‌లో ఏర్పడిన లీకేజీ సమస్యను గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ స్వయంగా పరిశీలించారు. సమస్య తీవ్రతను గమనించిన వెంటనే సంబంధిత సిబ్బందితో మాట్లాడి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు నిరంతరంగా స్వచ్ఛమైన తాగునీరు అందించడం గ్రామపంచాయతీ ప్రధాన బాధ్యత అని అన్నారు.తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీటి వృథా జరుగుతుండటాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకున్నామని చెప్పారు.సర్పంచ్ ఆదేశాల మేరకు పైప్‌లైన్ మరమ్మతుల పనులను వెంటనే ప్రారంభించగా, త్వరలోనే పనులు పూర్తి చేసి సాధారణ నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని సంబంధిత సిబ్బంది తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సుంచర మోని రాములు, మద్దిరాల రామ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బోయిన్ కృష్ణ, ప్రేమ్ కుమార్, గణేష్, గొల్ల సోమయ్య, ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొని సహకరించారు.

## అభినందనం తెలిపిన రాందాస్ గురువు



**జోగులాంబ గద్వాల, తెలంగాణ ముచ్చట్లు**: గద్వాల రాజోలి మండల కేంద్రంలో చిన్ననాటి వయసులో రాందాస్ కారణమేంట్ స్కూల్లో చదువు చెప్పే గురువుగారు తన బోధించిన చదువులకు ఎంతో చాలామంది విద్యార్థులు తమ బాధ్యతలు నిర్వహించి ఆ ప్రతి ఒక్కరు ఒక స్థాయిలో ఉన్నారు అని చెప్పడంతో రాందాస్ గురు ఎంతో ఆనందపడ్డారు వారి అభినందించాడు బాల్య మిత్రులు కలిసి గురువుగారి ఆశీర్వాదం తీసుకున్న శిశు బృందం వారి ఆధ్వర్యంలో ఒక రాజోలి మేజర్ గ్రామపంచాయతీ కి రెండు వార్డు నెంబర్ గా ఎన్నికైనటువంటి సత్తార్మియా ను నువ్వేనా కలిసి గురువుగారు ఆనందం వ్యక్తం చేశారు అలాగే వారు కలిసి గురువు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

## రామాంతపూర్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**రామాంతపూర్, డిసెంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం రామాంతపూర్ చర్చి కాలనీ పరిధిలోని లుద్ మాత చర్చిలో క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చర్చి కాలనీ సభ్యులతో కలిసి క్రిస్మస్ పండుగ కేక్‌ను కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యేసుక్రీస్తు బోధించిన ప్రేమ, క్షమాగుణం, శాంతి సందేశాలు ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. శత్రువుల పట్ల కూడా క్షమాభావంతో ఉండాలని క్రీస్తు ఇచ్చిన సందేశం నేటి సమాజానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆనంద్, జానీ, సుధాకర్, సతీష్, డేవిడ్, రత్న రెడ్డి, లక్ష్మా రెడ్డి, ప్రవీణ్ కుమార్, వాళ్లపు శ్రీకాంత్ యాదవ్, ఉపేందర్ రెడ్డి, సందీప్, భాస్కర్, వినయ్, కిరణ్, రాజు, రమ్మన, ఆరోగ్యమ్మ, సుమలత, బాబు రావు, శ్రీనివాస్, ఇన్నాశమ్మ, మేరీ, లూద్ రెడ్డి, రోజీ మేరీ, జయశీలం, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.అలాగే పెద్ద సంఖ్యలో క్రైస్తవ సహోదరులు, డివిజన్ నాయకులు హాజరై క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేశారు.

# నాచారం రాఘవేంద్ర నగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

◆ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌కు కాలనీవాసుల కృతజ్ఞతలు



**నాచారం, డిసెంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ నాచారం రాఘవేంద్ర నగర్ లోని జాన్సన్ గ్రామర్ స్కూల్ (కాంచన గ్రామర్ స్కూల్) వద్ద రోడ్డు నిర్మించాలని గత కొద్ది రోజులుగా కాలనీవాసులు నాచారం డివిజన్ కార్పొరేటర్‌ను వినతి పత్రాల ద్వారా కోరారు. వారి విజ్ఞప్తులకు స్పందించిన కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ రూ.34 లక్షల అంచనా వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు.ఈ సందర్భంగా నిధులు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కాలనీవాసులు కార్పొరేటర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని, 15 రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అలాగే వర్షపు నీరు నిలవకుండా సరైన డ్రైనేజీ సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముత్యం రెడ్డి, రాంబాబు, నూనె ప్రకాష్, సిహెచ్. రమేష్, ఎండి. హాఫీజుద్దీన్, షేక్ మహమూద్, మహమ్మద్ జహంగీర్, రాజేందర్, రామ్ బాబు పాల్గొన్నారు.

# అటల్ బిహారీ వాజ్‌పేయీ 101వ జయంతి చిత్రపటానికి ఘన నివాళులు



**చర్లపల్లి, డిసెంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ 101వ జయంతి సందర్భంగా గురువారం చర్లపల్లి డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. డివిజన్ అధ్యక్షులు చల్ల ప్రభాకర్ నేతృత్వంలో చక్రిపురం చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద వాజ్‌పేయీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా చల్ల ప్రభాకర్ మాట్లాడుతూ, భారత అభివృద్ధి గమనంలో నవశకానికి నాంది పలికిన మహానేత అటల్ బిహారీ వాజ్‌పేయీ పాలనాదక్షతకు ప్రతీక అని అన్నారు. సుపరిపాలనకు నూతన నిర్వచనం ఇచ్చిన నాయకుడిగా ఆయన దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. మాటల చాతుర్యం, నిర్ణయాల్లో దృఢసంకల్పం, దేశ ప్రయోజనాల పట్ల అచంచల నిబద్ధత వాజ్‌పేయీని భారత రాజకీయాల్లో ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని తెలిపారు.రాజకీయాలలో రాష్ట్రనీతిజ్ఞత, ప్రజాస్వామ్య విలువలు, దేశభక్తికి వాజ్‌పేయీ జీవితం నిజమైన నిదర్శనమని, ఆయన ఆశయాలు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కాసుల సురేందర్ గౌడ్, దేవనాథం, ఆనంద్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, గణేష్ ముదిరాజ్, లక్ష్మి నారాయణ, సహదేవ గౌడ్, రమేష్ చౌదరి, విద్యాసాగర్, రాజు, కళావతి, శ్రీకాంత్, శివ ప్రసాద్, వెంకటేష్ యాదవ్, వెంకటేశ్వర్లు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ బేకరీలో విజయ్ బర్త్‌డే వేడుకలు




**చక్రిపురం, డిసెంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ మన కాలనీ చక్రిపురం లో శ్రీరామ్ బేకరీ యజమాని విజయ్ బర్త్‌డే సందర్భంగా ప్రత్యేక శాలువ్‌తో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకలో కాలనీ అధ్యక్షుడు గడ్డల పాండు ముదిరాజ్, సెక్రటరీ సోమోసాని అశోక్, యాదిరెడ్డి, సహదేవ గౌడ్, వెంకటేష్ గుప్తా, సంతోష్ గుప్తా,యాకయ్య, కొండారెడ్డి, చంద్ర రెడ్డి, ఎర్రయ్య, మధుసూదన్ రెడ్డి, శ్రీను ముదిరాజ్ మరియు కాలనీ పెద్దలు పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా విజయ్‌కు ప్రత్యేకంగా శాలువ్ సన్మానం ఇవ్వబడింది మరియు ఆయనకు మంచి ఆశీస్సులు తెలియజేయడం జరిగింది. పాల్గొన్న పెద్దలు, సభ్యులు తనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం కాలనీ సామాజిక సమన్వయం మరియు అనుబంధాన్ని బలోపేతం చేసే సందర్భంగా నిలిచింది.విజయ్ మాట్లాడుతూ, తన పుట్టినరోజు వేడుకలో కలిసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆనందభరిత వాతావరణం నెలకొని, కాలనీ వాసులు సంతోషంగా పాల్గొన్నారు.

# రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి

**ఎల్కతుర్తి. డిసెంబర్ 25 (తెలంగాణ ముచ్చట్లు) :** ఎల్కతుర్తి మండలంలో జరిగిన రెండు వేరు వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలతో మండలంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. మొదటి ఘటనలో ఎల్కతుర్తి మండలానికి చెందిన చందుపట్ల అశోక్ కుమారుడు చందుపట్ల విద్యాసాగర్ (23) ఉదయం పాలు తీసుకెళ్లేందుకు హనుమకొండ వైపు వెళ్తుండగా అనంతసాగర్ క్రాస్ వద్ద లారీ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యాసాగర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు బట్టల దుకాణంలో పనిచేస్తూ, పాల వ్యాపారం



చందుపట్ల విద్యాసాగర్



కొమ్ముల అంజి

ద్వారా కుటుంబాన్ని పోషించేవాడని స్థానికులు తెలిపారు. మరో ఘటనలో ఎల్కతుర్తి మండలంలోని మోడల్ పాఠశాల సమీపంలో కారు ఢీకొనడంతో భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామానికి చెందిన కొమ్ముల కుమారస్వామి కుమారుడు కొమ్ముల అంజి (20) అక్కడికక్కడే మృతి చెందాడు. అంజి పాల వాహనం నడుపుతూ జీవనం కొనసాగించేవాడని సమాచారం. ఈ రెండు ఘటనలపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రెండు ప్రమాదాల్లోనూ యువకులు హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

# ఎలక్ట్రిక్ బైక్స్ కొనేవారికి షాక్.. జనవరి 1వ తేదీ నుంచే అమలు !

ఇండియన్ మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలకు విపరీతమైన డిమాండ్ ఉన్న సంగతి తెలిసిందే. పెట్రోల్ అలాగే డీజిల్ ధరలు దేశవ్యాప్తంగా సెంచరీ దాటేశాయి.దీంతో పెట్రోల్ వాహనాలు వాడేందుకు జనాలు వణికిపోతున్నారు. అదే సమయంలో దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం విపరీతంగా పెరిగింది. 40 వేల నుంచి మొదలుకొని రెండు లక్షల వరకు కూడా టూవీలర్ ఎలక్ట్రిక్ వెహికల్స్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే చాలా మంది సాధారణ పౌరులు కూడా ఎలక్ట్రిక్ వాహనాలను కొనేస్తున్నారు. ఇక మార్కెట్లో ఏథర్ ఎనర్జీ స్కూటర్లకు మంచి డిమాండ్ ఉంటుందన్న సంగతి తెలిసిందే. అయితే వాటి ధరలు త్వరలోనే పెరగనున్నట్లు కంపెనీ వెల్లడించింది. జనవరి ఒకటో తేదీ నుంచి ఈ పెరిగిన ధరలు అమలులోకి వస్తాయట. ఒక్కో బైక్ పైన రూ.3000 వరకు పెంచనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ముడి సరుకు, ఇతర ఎలక్ట్రిక్ పార్ట్స్ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుందట కంపెనీ. కాగా ఈ ఏథర్ ఎనర్జీలో లక్ష 14 వేల నుంచి 1,82,000 వరకు బైక్ ధరలు ఉన్నాయి. ఒక్కో మోడల్ ఒక్కో రేటు ఉంటుంది. ఇక ఏథర్ ఎనర్జీ తరహాలోనే ఇతర ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు పెరిగే ఛాన్స్ ఉందని చెబుతున్నారు.

# హైయర్ ఇండియాలో 49 వాటాను కొనుగోలు చేసిన భారతీ ఎంటర్‌ప్రైజెస్

ప్రముఖ భారతీ ఎంటర్‌ప్రైజెస్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. చైనాకు చెందిన హైయర్ గ్రూప్ అనుబంధ కంపెనీ హైయర్ ఇండియాలో 49 శాతం వాటాను కొనుగోలు చేసినట్టు బుధవారం ప్రకటనలో తెలిపింది. భారతీ ఎంటర్‌ప్రైజెస్, ఈక్విటీ కంపెనీ వార్‌బర్గ్ పింకస్ హైయర్ ఇండియాలో 49 శాతం వాటాను సంయుక్తంగా కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించాయి. అయితే, ఈ ఒప్పందానికి సంబంధించిన ఆర్థిక వివరాలను కంపెనీలు వెల్లడించలేదు. హైయర్ ఇండియాలో 49 శాతం వాటాను హైయర్ గ్రూప్ తన వద్దే ఉంచుకుంటుంది, మిగిలిన 2 శాతం వాటాను హైయర్ ఇండియా మేనేజ్‌మెంట్ బృందం వద్ద ఉంటుంది. ప్రస్తుతం హైయర్ బ్రాండ్ కింద దేశంలో ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మెషీన్, టీవీలతో పాటు పలు గృహోపకరణాలను విక్రయిస్తోంది. గత ఏడేళ్ల కాలంలో కంపెనీ ఏటా 25 శాతం వృద్ధిని నమోదు చేస్తోంది. ఈ భాగస్వామ్యం ద్వారా స్థానిక వనరుల సేకరణ, ఉత్పాదక సామర్థ్యాన్ని విస్తరించడం, కొత్త ఉత్పత్తులను తీసుకురావడం, మార్కెట్ విస్తరణను వేగవంతం చేయడం ద్వారా హైయర్ ఇండియా 'మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఫర్ ఇండియా' లక్ష్యాలకు మద్దతు ఇస్తుందని కంపెనీ పేర్కొన్నాయి.




# జెమిని ఏఐ, గూగుల్ వన్ ధరలను సగానికి తగ్గించిన గూగుల్

గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ తమ ప్రీమియం ఏఐ, క్లౌడ్ స్టోరేజీ సేవలపై భారీ తగ్గింపును ప్రకటించింది. పరిమిత కాలానికి వార్షిక సబ్‌స్క్రిప్షన్‌లపై 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్టు తాజా ప్రకటనలో వెల్లడించింది.జనరేటివ్ ఏఐ మార్కెట్లో ఆధిపత్యం కోసం పోటీ పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. తాజా ఆఫర్ గూగుల్ ఏఐ ప్రో, ప్రీమియం గూగుల్ వన్ ఎంచుకునే కొత్త సబ్‌స్క్రైబర్‌లకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. అంతేకాకుండా 2026, 15 జనవరి వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని, ఆ తర్వాత కస్టమర్లు రెన్యూవల్‌ను మాన్యువల్‌గా నిలిపివేస్తే తప్ప, సబ్‌స్క్రిప్షన్ సాధారణ ధరలకు ఆటోమెటిక్‌గా యాక్టివ్ అవుతుంది.




అయితే, ప్రస్తుతానికి ఈ ఆఫర్‌ను క్రిస్మస్ సందర్భంగా అమెరికాలో మాత్రమే అందిస్తున్నట్టు తెలుస్తోంది. భారత మార్కెట్‌లో అందుబాటులో లేదు. సాధారణంగా గూగుల్ మనదేశంలో పండుగల సీజన్ ఆధారంగా ఆఫర్లు ప్రకటిస్తుంది. కాబట్టి ఈ ఆఫర్ నూతన సంవత్సరం లేదా రాబోయే పండుగలకు డిస్కౌంట్ ఆఫర్లను అందించే అవకాశం ఉందని టెక్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఇప్పటికే దేశీయ టెలికాం దిగ్గజం రిలయన్స్ జియోతో భాగస్వామ్యం ద్వారా జియో యూజర్లకు ఉచితంగా జెమిని ఏఐ లభిస్తోంది. గూగుల్ వన్ మాత్రం ఏడాదికి స్టోరేజ్‌ను బట్టి రూ. 589 నుంచి రూ. 16,000 ఫీజుతో అందుబాటులో ఉంది. తాజా ఆఫర్ కింద జెమిని ఏఐ ప్రస్తుతం అమెరికాలో ఏడాదికి ధర సుమారు 199.99 డాలర్లు (మన కరెన్సీలో సుమారు రూ. 17,950) నుంచి 99.99 డాలర్ల (సుమారు రూ. 8,975)కి తగ్గుతుంది. కానీ, ఆ తర్వాత ఏడాది నుంచి ఇది 239.88 డాలర్లు (సుమారు రూ. 21,530) అవుతుంది. అధిక ధరతో సబ్‌స్క్రిప్షన్ వద్దనుకునే కస్టమర్లు ఏడాది తర్వాత ఆటోరెన్యూవల్ ఫీచర్‌ను నిలిపేయాల్సి ఉంటుంది.

# దేశీయ విమానయాన రంగంలోకి కొత్తగా మూడు సంస్థలు

దేశీయ విమానయాన రంగంలోకి కొత్త సంస్థలు అడుగుపెట్టనున్నాయి. బుధవారం పౌరవిమానయాన శాఖ రెండు కొత్త విమానయాన సంస్థలకు విమానాలు నడిపేందుకు అనుమతి ఇచ్చింది. ఇటీవల ఇండిగో సంస్థ కారణంగా ఏర్పడిన అంతరాయం నేపథ్యంలో కొన్ని విమానయాన సంస్థలపైనే ఆధారపడటాన్ని తగ్గించాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. తాజాగా అల్ హింద్ ఎయిర్, ఫ్లైఎక్స్‌ప్రెస్ సంస్థలు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి నిరభ్యంతర ధృవీకరణ పత్రాలను(ఎన్‌ఓసీ) పొందాయి. దేశీయ విమానయాన రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో ఈ ఆమోదాలు రావడంతో రానున్న రోజుల్లో పోటీ మరింత తీవ్రం కానుంది. ఈ రెండింటితో పాటు ఉత్తరప్రదేశ్‌లోని మరో విమానయాన సంస్థ శంఖ్ ఎయిర్ ఇప్పటికే తన ఎన్‌ఓసీని పొందింది. ఈ సంస్థ 2026లో కమర్షియల్ విమాన సర్వీసులను ప్రారంభించే అవకాశం ఉంది. ప్రయాణీకుల డిమాండ్ పెరుగుతున్నప్పటికీ, అధిక ఖర్చులు, అప్పులు, నిర్వహణ సవాళ్ల కారణంగా కొత్త విమానయాన సంస్థలు గతంలో మనుగడ సాగించడం కష్టమని భావించాయి. ప్రస్తుతం దేశంలో తొమ్మిది షెడ్యూల్ దేశీయ విమానయాన సంస్థలు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రాంతీయ క్యారియర్ ఫ్లై బిగ్ షెడ్యూల్ చేసిన సేవలను ఆపివేసిన తర్వాత అక్టోబర్‌లో ఈ సంఖ్య మరింత తగ్గింది. ముఖ్యంగా ప్రయాణీకుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతున్న సమయంలో ఈ రంగం తక్కువ అందుబాటులో ఉండటంపై ఆందోళనను పెంచింది. మార్కెట్‌లో ఎక్కువగా ఇండిగో, ఎయిర్ ఇండియా గ్రూప్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఇందులో ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి. ఈ విమానయాన సంస్థలు కలిసి దేశీయ విమాన ప్రయాణాలలో 90 శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి. ఇండిగో మాత్రమే మార్కెట్‌లో 65 శాతం కంటే ఎక్కువ వాటాతో కొనసాగుతోంది. ఈ నెల ప్రారంభంలో ఇండిగోలో నెలకొన్న తీవ్ర సంక్షోభం దేశవ్యాప్తంగా ప్రయాణికులను ప్రభావితం చేశాయి. అతిపెద్ద పెద్ద దేశంగా, విస్తరిస్తున్న మార్కెట్‌లో ఒకే విమానయాన సంస్థపై ఎక్కువగా ఆధారపడటం వల్ల కలిగే నష్టాలను ఈ సంఘటన ముందుకు తెచ్చింది.



# 800+ సిబిల్ స్కోరు కొందరికే.. ఎందుకిలా? మనమెలా అందుకోవాలి?

మంచి క్రెడిట్ స్కోరు ఉంటే తక్కువ వడ్డీకే రుణాలు లభిస్తాయి. రుణ దరఖాస్తులు త్వరగా ఆమోదం పొందుతాయి. రుణాల విషయంలో బ్యాంకులు/ఆర్థిక సంస్థలతో వడ్డీ విషయంలో బేరమాడొచ్చు. క్రెడిట్ స్కోరు 800+ ఉంటే దీర్ఘకాలంలో వడ్డీ రేట్లపై పెద్దఎత్తున ఆదా చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. కానీ, సిబిల్ స్కోరు 800కు పైబడి ఉన్నవారి సంఖ్య తక్కువే. దీనికి కారణమేంటి? మరి ఈ స్కోరును ఎలా సాధించాలి?

చాలామంది సిబిల్ స్కోరు, క్రెడిట్ స్కోరు ఒకటే అనుకొని పొరబడుతుంటారు. వాస్తవానికి క్రెడిట్ స్కోరును జారీ చేయడానికి వివిధ క్రెడిట్ బ్యూరోలు ఉన్నాయి. ఈక్విఫాక్స్, ఎక్స్‌పీరియన్, సీఆర్ఐఎఫ్ హైమార్క్ వంటి సంస్థలు ఆర్బీఐ నుంచి లైసెన్సు పొందాయి. ట్రాన్స్‌యూనియన్ సిబిల్ కూడా అందులో ఒకటి. కానీ, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఎక్కువగా సిబిల్‌నే ప్రామాణికంగా తీసుకుంటాయి. దీంతో క్రెడిట్ స్కోరు అనే పదానికి సిబిల్ ప్రత్యామ్నాయంగా మారింది.




పరిమిత సంఖ్యలోనే..

సిబిల్ స్కోరు రేంజ్ 300 నుంచి 900 వరకు ఉంటుంది. 800 కంటే ఎక్కువ సిబిల్‌స్కోరు ఉన్నవారు ఎక్సలెంట్ కేటగిరీ కిందకు వస్తారు. కానీ, 800, అంతకంటే ఎక్కువ క్రెడిట్ స్కోరు ఉన్నవారు 1020 శాతం మధ్యే ఉంటారనేది అంచనా. ఎక్కువమంది 700750, 750800 రేంజ్‌లో ఉంటారు. పేమెంట్ హిస్టరీ, క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో, క్రెడిట్ హిస్టరీ లెంగ్త్ వంటి అంశాలు స్కోరును ప్రభావితం చేస్తాయి. ఇందులో ఏ ఒక్క విషయంలో తప్పటడుగు పడినా 800 స్కోరు చేరుకోవడం కష్టం. దేశంలో ఇప్పటికీ క్రెడిట్ స్కోరు లేనివారు చాలామందే ఉన్నారు. మరోవైపు దీర్ఘకాలంలో క్రెడిట్ హిస్టరీ లేకపోవడం, వ్యక్తిగత కారణాలతో చెల్లింపులు సకాలంలో చేయకపోవడం వంటివి చాలామందిని 800+ స్కోర్‌కు దూరం చేస్తున్నాయి. కేవలం సంపన్నులు, ఆర్థిక వ్యవహారాలపై అవగాహన ఉన్నవాళ్లు మాత్రమే మెరుగైన క్రెడిట్ స్కోరును సాధిస్తున్నారు.

# రూ. 2.44 లక్షలకు చేరిన వెండి ధరలు




దేశీయ మార్కెట్లో బంగారం ధరలు దూసుకెళ్తున్నాయి. ఇప్పటికే రికార్డు గరిష్ఠాలకు చేరిన పసిడి, వెండి ధరలు బుధవారం కూడా కొత్త గరిష్ఠాలను తాకాయి. అయితే, ధరలు దేశీయ మార్కెట్లలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ముఖ్యంగా వెండి ధరలు భారీగా పెరిగాయి. బుధవారం వెండి ఏకంగా రూ. 10,000 పెరగడంతో కిలో రూ. 2,44,000కి చేరుకుంది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో స్వచ్ఛమైన పది గ్రాముల బంగారం రూ. 1.41 లక్షలు దాటింది. బులియన్ మార్కెట్ వివరాల ప్రకారం, హైదరాబాద్ మార్కెట్లో స్వచ్ఛమైన పసిడి 10 గ్రాములు రూ. 1,39,030 చేరుకుంది. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ. 1,27,350 వద్ద ఉంది. గ్లోబల్ మార్కెట్లలో ఔన్స్ బంగారం తొలిసారి 4,500 డాలర్లను అధిగమించింది. ఓ దశలో 4,507 డాలర్లకు చేరిన ఔన్స్ బంగారం, ఆ తర్వాత కొంత దిగొచ్చింది. రికార్డు ధరలకు ప్రధానంగా వచ్చే ఏడాది అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లలో కోత విధిస్తుందన్న అంచనాలు పెరగడంతో పాటు బంగారంలో పెట్టుబడులకు గిరాకీ కొనసాగడం, అమెరికా డాలర్‌తో పాటు భారత కరెన్సీ రూపాయి బలహీనంగా కొనసాగుతుండటం కారణాలుగా ఉన్నాయి.

# క్యాస్ట్రోల్‌లో 65% వాటా విక్రయం




లూబ్రికెంట్లు తయారు చేసే క్యాస్ట్రోల్ ఇండియా మాతృసంస్థ, బ్రిటన్‌కు చెందిన క్యాస్ట్రోల్‌లో 65% వాటా విక్రయించడానికి బ్రిటన్ ఇంధన సంస్థ బీపీ అంగీకరించింది. అంతర్జాతీయ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ స్టోన్‌పీక్‌కు ఈ వాటా విక్రయిస్తామని తెలిపింది. క్యాస్ట్రోల్ కంపెనీ విలువను 10.10 బిలియన్ డాలర్లు (సుమారు రూ.90,900 కోట్లు)గా పరిగణించి ఈ లావాదేవీ నిర్వహించనున్నారు. ఈ విక్రయంతో బీపీకి 6 బి. డాలర్ల (రూ.54,000 కోట్ల) వరకు వస్తాయి. 2026 చివరికల్లా ఒప్పందం పూర్తవుతుందని బీపీ భావిస్తోంది. క్యాస్ట్రోల్‌కు చెందిన మైనారిటీ వాటాలు (1.8 బి. డాలర్లు) కూడా ఈ లావాదేవీలో భాగమే. ఇందులో ఎక్కువ భాగం క్యాస్ట్రోల్ ఇండియా నుంచి వస్తుండడం గమనార్హం. సెప్టెంబరు త్రైమాసికం చివరకు క్యాస్ట్రోల్‌కు క్యాస్ట్రోల్ ఇండియాలో 51% వాటా ఉంది. ఈ లావాదేవీ తర్వాత స్టోన్‌పీక్‌కు 65%, బీపీకి 35% వాటాలతో కొత్త సంయుక్త సంస్థ ఏర్పాటు కానుంది. రెండేళ్ల లాక్ ఇన్ గడువు ముగిశాక, క్యాస్ట్రోల్‌లో తనకున్న 35% వాటాను బీపీ విక్రయించేందుకు వీలుంది.

# అపోలో హాస్పిటల్స్ వాటాదార్లకు అపోలో హెల్త్‌టెక్ షేర్లు

అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతిపాదించిన పునర్‌వ్యవస్థీరణ ప్రణాళికకు స్టాక్ ఎక్స్ఛేంజీలు అనుమతి ఇచ్చాయి. ఫార్మసీ వ్యాపారాన్ని, డిజిటల్ హెల్త్‌కేర్ వ్యాపారాన్ని విడదీయాలనిబీ అనుబంధ కంపెనీలైన అపోలో హెల్త్‌కో, కీమెడ్ లను అపోలో హెల్త్‌టెక్‌లో కలపాలని సంస్థ ప్రతిపాదించింది. దీనిపై బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నుంచి నిరభ్యంతర పత్రం జారీ అయినట్లు అపోలో హాస్పిటల్స్ వెల్లడించింది. ఈ విలీనం తర్వాత అపోలో హెల్త్‌టెక్ షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేస్తారు. దీనివల్ల అపోలో హాస్పిటల్స్ వాటాదార్లకు ప్రతి 100 షేర్లకు, 195.2 అపోలో హెల్త్‌టెక్ షేర్లు లభిస్తాయి. అపోలో హాస్పిటల్స్‌కు అపోలో హెల్త్‌టెక్‌లో 15% వాటా ఉంటుంది. అపోలో హెల్త్‌కో ఫార్మా ఉత్పత్తుల టోకు వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. దీనికింద అపోలో 24/7 డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఉంది. కీమెడ్ హోల్‌సేల్ ఫార్మా, హెల్త్‌కేర్, వెల్‌నెస్ ఉత్పత్తులను పంపిణీ చేస్తోంది. విలీనం తర్వాత అపోలో హెల్త్‌టెక్ కింద ఫార్మసీ పంపిణీ వ్యాపారం, డిజిటల్ హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్ వ్యాపారాలుంటాయి.

# ఈ తప్పులు చేస్తున్నారా?



జిమ్‌కి వెళ్లడం మంచి ఆరోగ్యానికి అవసరం. మీరు ప్రతిరోజూ వ్యాయామం చేస్తే అనేక ఆరోగ్య సమస్యలు దూరంగా ఉంటాయి. అయితే మహిళలు కొన్ని ప్రత్యేక సమయాల్లో జిమ్‌లో కసరత్తులు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్యా నిపుణులు సూచిస్తున్నారు. జిమ్‌కి వెళ్లడం మంచి ఆరోగ్యానికి అవసరం. మీరు ప్రతిరోజూ వ్యాయామం చేస్తే అనేక ఆరోగ్య సమస్యలు దూరంగా ఉంటాయి. అయితే మహిళలు కొన్ని ప్రత్యేక సమయాల్లో జిమ్‌లో కసరత్తులు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్యా నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పీరియడ్స్ సమయంలో అమ్మాయిలు 4 నుండి 5 రోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు. అయితే కొందరు ఈ సమయంలో రన్నింగ్, వాకింగ్ వంటి చూయడం కూడా కనిపిస్తుంది. ఇది మాత్రమే కాదు వారు జిమ్‌లో బరువులు ఎత్తడం కూడా చేస్తారు. అయితే పీ రియడ్స్ సమయంలో ఇలా చేయడం నిజంగా మంచిదేనా? అనే అభిప్రాయం చాలా మందికి ఉంటుంది. ఎందుకంటే ఈ సమయంలో చాలా మంది అసౌకర్యాన్ని అనుభవిస్తారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం పీరియడ్స్ సమయంలో మహిళలు వీలైనంత ఎక్కువ విశ్రాంతి తీసుకోవడం మంచిది. ఎందుకంటే మీకు ఎటువంటి అసౌకర్యం అనిపించకపోయినా ఈ సమయంలో శరీరం అనేక ప్రధాన మార్పుల ద్వారా వెళుతుంది. మీరు పీరియడ్స్ సమయంలో బరువులు ఎత్తితే అది మీ శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా ఇది ప్రేగులపై నేరుగా ప్రభావం చూపుతుంది. అలాంటి సందర్భంలో మీరు వీలైతే జిమ్‌కు వెళ్లకుండా ఉండాలి. తేలికపాటి యోగాసనాలు చేయడం మంచిదే. అయితే జిమ్‌కు వెళ్లి భారీ వ్యాయామాలు చేయడం ప్రమాదకరం.



# ఈ దేశంలో రెడ్ లిప్‌స్టిక్ వేసుకుంటే..

అందం కోసం మగువలు ఎన్నో మార్గాలు అన్వేషిస్తుంటారు. ఎంత మేకప్ వేసుకున్న అదరాలకు లిప్‌స్టిక్ అద్దకుంటే అలంకరణ పూర్తి కాదు. లిప్‌స్టిక్ అందం, ఆత్మవిశ్వాసానికి చిహ్నంగా భావిస్తారు. ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల లిప్‌స్టిక్‌లు అందుబాటులో ఉన్నాయి. లిప్‌స్టిక్ వివిధ రంగులలో కూడా లభిస్తుంటాయి. అందం కోసం మగువలు ఎన్నో మార్గాలు అన్వేషిస్తుంటారు. ఎంత మేకప్ వేసుకున్న అదరాలకు లిప్‌స్టిక్ అద్దకుంటే అలంకరణ పూర్తి కాదు. లిప్‌స్టిక్ అందం, ఆత్మవిశ్వాసానికి చిహ్నంగా భావిస్తారు. ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల లిప్‌స్టిక్‌లు అందుబాటులో ఉన్నాయి. లిప్‌స్టిక్ వివిధ రంగులలో కూడా లభిస్తుంటాయి. అయితే లిప్‌స్టిక్ ధర మాత్రం బ్రాండ్ ప్రకారం మారుతుంది. ప్రపంచవ్యాప్తంగా రెడ్ లిప్‌స్టిక్ ఉపయోగించే మహిళల సంఖ్య ఎక్కువట. కానీ ఇప్పుడు ఇదే ఎరుపు లిప్‌స్టిక్ మహిళలకు సమస్యగా మారింది. దీంతో ఓ దేశం మహిళలు ఎరుపు రంగు లిప్‌స్టిక్ వేసుకోవడం పూర్తిగా నిషేధించింది. దీంతో ఆ దేశంలో మహిళలు తమ దేశంలో తయారు చేసిన లేత రంగు లిప్‌స్టిక్‌లను మాత్రమే ధరించడానికి అనుమతి ఉంది. ఎర్రటి లిప్‌స్టిక్‌ను నిషేధించిన దేశం ఏదో కాదు ఉత్తర కొరియా. కిమ్ జోంగ్ ఉన్ ఈ దేశ నియంత. ఈ దేశంలో ఎర్రటి లిప్‌స్టిక్‌ను పాశ్చాత్య సంస్కృతి, పెట్టుబడిదారీ విధానానికి చిహ్నంగా భావిస్తారట. అందుకే ఈ దేశంలో ఎర్రటి లిప్‌స్టిక్‌పై అనధికారికంగా కఠినమైన ఆంక్షలు ఉన్నాయి. ఉత్తర కొరియాలో ఎరుపు రంగు లిప్‌స్టిక్ గ్లామర్, వ్యక్తిగత ఆకర్షణ, పాశ్చాత్య ప్రభావానికి చిహ్నంగా భావిస్తారు. ఈ రకమైన మేకప్ యువతలో వ్యక్తివాదాన్ని పెంచుతుందని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఈ వింత ఆంక్షలు అమలు చేస్తున్నాడు. ఇలా చేయడం వల్ల దేశం సంక్షోభాన్ని ఎదుర్కోవచ్చని కిమ్ జోంగ్ ఉన్ విశ్వసిస్తున్నారు. అందుకే అక్కడ ఎరుపు రంగు లిప్‌స్టిక్ వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. ఉత్తర కొరియాలో మహిళలు తేలికపాటి లిప్‌స్టిక్, పరిమిత మేకప్ మాత్రమే ధరించడానికి అనుమతి ఉంది. విదేశీ బ్రాండ్లు, ముదురు రంగులు, ఆడంబరమైన మేకప్ నిబంధనలకు విరుద్ధమైనవట. ఈ నియమాలను ఉల్లంఘించి ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటారు.

# క్రిస్మస్ వేళ ఎవరీ 'సీక్రెట్ శాంటా'?




డిసెంబర్ వచ్చిందంటే చాలు ప్రపంచమంతా క్రిస్మస్ వెలుగులతో నిండిపోతుంది. రంగురంగుల విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీలు, కేకులతో పాటు ప్రతి ఆఫీసులోనూ, స్నేహితుల మధ్య ఒక వింతైన ఆట మొదలవుతుంది. అదే 'సీక్రెట్ శాంటా'. డిసెంబర్ వచ్చిందంటే చాలు ప్రపంచమంతా క్రిస్మస్ వెలుగులతో నిండిపోతుంది. రంగురంగుల విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీలు, కేకులతో పాటు ప్రతి ఆఫీసులోనూ, స్నేహితుల మధ్య ఒక వింతైన ఆట మొదలవుతుంది. అదే 'సీక్రెట్ శాంటా'. ఎవరో ఒకరు మనకు తెలియకుండా మన డెస్క్ మీద గిఫ్టులు పెట్టి వెళ్తుంటారు, అలాగే మనం కూడా ఎవరికో ఒకరికి గిఫ్ట్ పంపాలి కానీ అది మనమే అని వారికి తెలియకూడదు. ఈ దాగుడుమూతల గిఫ్ట్ గేమ్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఒక ట్రెండ్‌గా మారింది. అయితే ఈ సంప్రదాయం ఊరికే పుట్టలేదు. దీని వెనుక వందల ఏళ్ల చరిత్ర, ఒక గొప్ప మనసున్న వ్యక్తి కథ దాగి ఉంది. ఈ ఆధునిక సంప్రదాయానికి ఆద్యుడు లారీ డీన్ స్టీవర్ట్ అనే అమెరికన్ బిజినెస్ మ్యాన్ అని చెబుతుంటారు. 1970వ దశకంలో ఆయన తన జీవితంలో ఎన్నో కష్టాలను అనుభవించారు. కానీ ఒకసారి తన వ్యాపారం పుంజుకున్నాక, తాను పడిన కష్టాలు ఇతరులు పడకూడదని నిర్ణయించుకున్నారు. ప్రతి ఏడాది క్రిస్మస్ సమయంలో ఆయన అపరిచితులకు, పేద వారికి తన పేరు బయటకు పెట్టకుండా 100 డాలర్ల నోట్లను పంచుతుండేవారు. దాదాపు 25 ఏళ్ల పాటు తన ఎవరో ఎవరికీ తెలియకుండా ఈ దానధర్మాలు చేశారు. అందుకే ఆయనను 'ఒరిజినల్ సీక్రెట్ శాంటా' అని పిలుస్తారు. ఈ సంప్రదాయం కేవలం అమెరికాకు మాత్రమే పరిమితం కాలేదు. వివిధ దేశాల్లో దీనిని రకరకాల పేర్లతో పిలుస్తారు. స్కాండినేవియాలో దీనిని 'జుల్ క్లాప్' అని పిలుస్తారు. ఎవరో ఒకరు ఇంటి తలుపు కొట్టి, పేరు చెప్పకుండా గిఫ్ట్ వదిలేసి వెళ్ళడం ఇక్కడి ఆచారం. జర్మనీలో ఇక్కడ 'విక్టెల్న్' అని పిలుస్తారు. అంటే ఒక చిన్న దేవత లేదా పిశాచి అని అర్థం. వారు తెలియకుండా గిఫ్టులు ఇస్తారని వారి నమ్మకం. ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచంలో 'సీక్రెట్ శాంటా' అనేది కేవలం గిఫ్టులకే పరిమితం కాలేదు. ఇది ఉద్యోగుల మధ్య సంబంధాలను మెరుగుపరచడానికి ఒక మంచి మార్గంగా మారింది. ఆఫీసులో ఒకరితో ఒకరికి పెద్దగా పరిచయం లేని వారు కూడా ఈ ఆట వల్ల మాట్లాడుకోవడం మొదలుపెడతారు. ఏడాది పొడవునా పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు ఈ సరదా పండుగ వాతావరణం ఎంతో ఉపశమనాన్ని ఇస్తుంది. అందరూ కలిసి గిఫ్టులు ఇచ్చుకోవాలి అంటే ఖరీదైనవి కాకుండా, ఒక నిర్ణీత బడ్జెట్‌లో కొనుక్కోవడం వల్ల ఎవరికీ భారం అనిపించదు. ఎవరు ఏ గిఫ్ట్ ఇస్తారో అన్న ఉత్సుకత, చివరి రోజున మన శాంటా ఎవరో తెలుసుకున్నప్పుడు కలిగే ఆనందం.. ఇవే ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ సజీవంగా ఉంచుతున్నాయి. బహుమతి చిన్నదా పెద్దదా అన్నది ముఖ్యం కాదు, దాని వెనుక ఉన్న ఆ ప్రేమ, సంతోషం పంచడమే ఈ 'సీక్రెట్ శాంటా' అసలైన ఉద్దేశం. మరి ఈ ఏడాది మీ సీక్రెట్ శాంటా ఎవరో గెస్ చేశారా?

# చిన్న ట్రిక్‌తో సైకాలజిస్టులను ఫిదా చేసిన స్టార్ హీరోయిన్?



ఆమె వెండితెరపైనే కాదు, నిజ జీవితంలోనూ ఒక పర్ఫెక్ట్ రోల్ మోడల్. భర్త క్రికెట్ దిగ్గజం కావడంతో సహజంగానే వారి ఇంట్లో ఆరోగ్యం, ఫిట్‌నెస్ విషయంలో చాలా కఠినమైన నియమాలు ఉంటాయి. ఆమె వెండితెరపైనే కాదు, నిజ జీవితంలోనూ ఒక పర్ఫెక్ట్ రోల్ మోడల్. భర్త క్రికెట్ దిగ్గజం కావడంతో సహజంగానే వారి ఇంట్లో ఆరోగ్యం, ఫిట్‌నెస్ విషయంలో చాలా కఠినమైన నియమాలు ఉంటాయి. అయితే, చిన్న పిల్లలకు పోషకాహారం తినిపించడం అనేది ఏ తల్లికైనా ఒక పెద్ద సవాలుతో కూడుకున్న పని. సాధారణంగా తల్లులు పిల్లలకు భయం చెప్పి లేదా మొండిగా ఆహారం తినిపిస్తుంటారు. కానీ ఈ స్టార్ హీరోయిన్ మాత్రం తన ముద్దుల కూతురి విషయంలో ఒక వినూత్నమైన మార్గాన్ని ఎంచుకుంది. ఆమె అనుసరిస్తున్న ఈ విధానం చూసి కేవలం నెటిజన్లు మాత్రమే కాదు, చైల్డ్ సైకాలజిస్టులు కూడా ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇంతకీ ఆ 'స్టార్ మామ్' ఎవరు? చాలామంది తల్లులు పిల్లలు తినకపోతే టీవీ చూపించడమో లేదా బెదిరించడమో చేస్తుంటారు. కానీ ఈ నటి మాత్రం అలాంటి పద్ధతులకు స్వస్తి పలికింది. ఆహారం విషయంలో ఆమె మూడు ముఖ్యమైన సూత్రాలను పాటిస్తోంది. ప్లేట్‌లో ఏ ఆహారం ఉండాలో పిల్లలనే నిర్ణయించుకోనివ్వాలి. దీనివల్ల తమకు నచ్చిన వస్తువును తింటున్నామనే భావన పిల్లల్లో కలుగుతుంది. కూరగాయలు, పండ్లు తింటే శరీరానికి ఎలాంటి శక్తి వస్తుందో చిన్న చిన్న కథల రూపంలో ఆమె వివరిస్తుంది. అంటే 'ఇది తింటే నువ్వు సూపర్ గర్ల్ అవుతావు' అని చెప్పడం లాంటివి అన్నమాట. తల్లిదండ్రులు తింటున్నది చూసి పిల్లలు ఎక్కువగా నేర్చుకుంటారు. అందుకే ఆమె కూడా తన కూతురితో కలిసి ఆరోగ్యకరమైన భోజనాన్ని తింటూ ఆమెకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ నటి అనుసరిస్తున్న పద్ధతిని నిపుణులు 'పాజిటివ్ రీఇన్‌ఫోర్స్‌మెంట్' అని పిలుస్తున్నారు. ఆహారంపై పిల్లలకు భయం లేదా అయిష్టత కలగకుండా, అది ఒక ఇష్టమైన పనిగా మార్చడంలో ఈమె సక్సెస్ అయిందని వారు చెబుతున్నారు. ఆహారాన్ని ఒక రివార్డ్‌లా కాకుండా, జీవనశైలిలో భాగంగా నేర్పించడం వల్ల భవిష్యత్తులో పిల్లలు ఊబకాయం వంటి సమస్యల బారిన పడకుండా ఉంటారని నిపుణుల అభిప్రాయం. తన కుమార్తె వామికను ఆరోగ్యంగా పెంచడంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటున్న ఆ స్టార్ హీరోయిన్ మరెవరో కాదు.. అనుష్క శర్మ! అవును, విరాట్ కోహ్లీ భార్యగా,

# ఆఫీసులో ప్రమోషన్ అందుకోవాలా!



చాలా మందికి తాము పని చేసే ఆఫీసులో త్వరగా ప్రమోషన్ అందుకోవాలి. మంచి పొజిషన్‌కు వెళ్లాలి అనే కోరిక ఉంటుంది. దీని కోసం కొంత మంది చాలా కష్టపడుతారు. కానీ కొంత మంది ఎంత కష్టపడినా, తగిన గుర్తింపు లభించదు. అయితే ఇలా మీ ఆఫీసులో మీరు విజయం సాధించలేకపోతే తప్పకుండా కొన్ని వాస్తు చిట్కాలు పాటించాలి అంటున్నారు నిపుణులు. ఇంటి తర్వాత ఎక్కువ మంది సమయం గడిపేది ఆఫీసులోనే అందుకే, మీరు పనిచేసే చోట ప్రశాంతకరమై వాతావరణం నెలకొనాలి, సానుకూల శక్తి ఉండాలి అంటే తప్పకుండా కొన్ని వాస్తు నియమాలు పాటించాలంట. ముఖ్యంగా కొన్ని వస్తువులు మీ డెస్క్ దగ్గర పెట్టుకోవడం వలన మీరు చేసే పనిలో ఆటంకాలు లేకుండా, పనికి తగిన గుర్తింపు లభిస్తుందంట. ఇంతకీ ఆ వస్తువులు ఏవో ఇప్పుడు చూద్దాం. లక్కీ వెదురు : లక్కీ వెదురు మీ ఆఫీస్ డెస్క్ వద్ద పెట్టుకోవడం వలన అదృష్టం కలిసి వస్తుదని చెబుతున్నారు వాస్తు శాస్త్ర నిపుణులు. ఇది ప్రతి కూల శక్తిని దూరం చేసి, సానుకూల శక్తిని తీసుకొస్తుంది. అదే విధంగా ఈ మొక్క మీ డెస్క్ వద్ద ఉండటం వలన అన్ని విధాల కలిసి వస్తుందంట. తాబేలు : తాబేలు విగ్రహం వాస్తు దోషాలను తగ్గిస్తుంది. అయితే ఎవరు అయితే ఆఫీసులో సమస్యలు ఎదుర్కొంటున్నారో, వారు డబ్బు ఆదా చేయడానికి, త్వరగా ప్రమోషన్ పొందడానికి మీ డెస్క్ వద్ద తప్పకుండా తాబేలు విగ్రహం పెట్టుకోవాలంట. ఇది మీకు మంచి ఫలితాలను ఇస్తుంది. క్రిస్టల్ ట్రీ : వాస్తు శాస్త్రం ప్రకారం ఎవరు అయితే క్రిస్టల్ ట్రీ తమ ఆఫీస్ డెస్క్ వద్ద పెట్టుకుంటారో, వారు తమ పనిలో విజయం సాధిస్తారంట. అదే విధంగా నిలిచిపోయిన పనులు త్వరగా పూర్తి అవుతాయి. మీకు మంచి గుర్తింపు లభిస్తుంది. పిరమిడ్ : మీరు పని చేసే కార్యాలయంలో, మీ డెస్క్ వద్ద పిరమిడ్ పెట్టుకోవడం చాలా శుభప్రదం. ఇది మీ అభివృద్ధికి దోహదం చేస్తుంది. ఆఫీసులో మీకు శాంతియుత వాతావరణాన్ని క్రియేట్ చేస్తుందంట.

## కొత్త సంవత్సరం మొదటి రోజు మహిళలు తప్పక చేయాల్సిన పనులు



కొత్త ఏడాది ప్రారంభం కాబోతుంది. 2025 ముగిసి, 2026 ప్రారంభం కానుంది. ఈ సంవత్సరంలో ఆనందంగా ఉండి, డబ్బుకు ఎలాంటి లోటు ఉండకూడదు అంటే మహిళలు తప్పకుండా కొన్ని పనులు చేయాలి అని చెబుతున్నారు పండితులు. కొత్త సంవత్సరంలో ఇంటిలో ఆనందాలు వెల్లివెరియాలి, ఆరోగ్యంగా ఉండాలంటే మహిళలు తప్పకుండా కొన్ని పనులు చేయాలంట, దీని వలన ఇంటిలో సంపద పెరగడమే కాకుండా సంవత్సరం మొత్తం లక్ష్మీ దేవి అనుగ్రహం ఉంటుంది. అనుకున్న పనులన్నీ సరైన సమయానికి పూర్తి అవుతాయని చెబుతున్నారు నిపుణులు. కొత్త సంవత్సరం మొదటి రోజు మహిళ తప్పకుండా ఇంటిముందు అందంగా ముగ్గులు వేసి, తులసి చెట్టును పూజించి, దానికి ఎరుపు రంగు దారం కట్టాలంట. అంతే కాకుండా తులసి పూజ చేస్తూ, విష్ణు మంత్రాలు జపించాలి. దీని వలన ఇంటిలో సంపద పెరుగుతుందంట. ఆరోగ్యపరంగా, ధన పరంగా కలిసి వస్తుందని చెబుతున్నారు వాస్తు నిపుణులు. సూర్య భగవానుడికి అర్ఘ్యం సమర్పించడం : కొత్త సంవత్సరం మొదటి రోజు ఏ గృహిణి అయితే ఉదయాన్నే బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేచి, గంగాజలంతో స్నానం చేసి, సూర్య భగవానుడికి అర్ఘ్యం సమర్పిస్తారో, వారి ఇంట ఆనందాలు నెలకొంటాయంట. అంతే కాకుండా వారిపై సూర్య భగవానుడి అనుగ్రహం, లక్ష్మీదేవి అనుగ్రహం సంవత్సరం మొత్తం ఉంటుందంట. నూతన సంవత్సరం దంపతులు ఇంటి పెద్దవారి నుంచి ఆశీర్వాదం పొందాలి. అలాగే తమ పిల్లలకు కూడా ఆశీర్వచనం ఇవ్వాలంట. దీని వలన పెద్దల ఆశీర్వాదం, భగవంతుడి చల్లని చూపు మీ పై ఉండి, మీకు లోటు రాకుండా చూస్తాడంట. అంతే కాకుండా పెద్దలను గౌరవించే చోట ధనానికి లోటే ఉండదంట. అలాగే 2026 సంవత్సరం మొదటి రోజున ఇష్టదైవాన్ని పూజించాలి. ముఖ్యంగా
ఈ రోజు వినాయకుడిని పూజించి, శివ పూజ చేయడం, అలాగే, మీ చేతులతో స్వయంగా స్వీట్ తయారు చేసి దేవుడికి నైవేద్యం సమర్పించడం, ఆవుకు ఆహారం ఇవ్వడం చాలా శుభప్రదం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# విద్యార్థులకు తిండిపెట్టలేని స్థితిలో ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

కాస్మటిక్ చార్జీలు కూడా పెండిరగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. రేవంత్ సర్కారు కమిషన్‌ల సర్కారు అని, కమిషన్‌లు లేకుండా ఏ పనీ చేయడం లేదని ఆరోపించారు. విద్యార్థులు కమిషన్‌లు ఇచ్చుకోలేరు కాబట్టే మెస్ బిల్లులు, కాస్మొటిక్ చార్జీలు పెండిరగ్‌లో పెట్టినట్టున్నరని ఎద్దేవా చేశారు. విద్యార్థులకు పెండిరగ్లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మొటిక్ చార్జీలను వెంటనే చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సీఎం గ్రీన్ ఛానెల్ పెట్టి విద్యార్థులకు బిల్లులు ఇప్పిస్త అన్నడని, కానీ ఇంతవరకు బిల్లు ఇవ్వలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతయని, చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. విద్యార్థులకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోతే తోలు వలుస్తా, తోడ్కలు తీస్తా అని రేవంత్‌రెడ్డి గొప్పలు మాట్లాడిరడని, అయినా బిల్లులు పెండిరగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు.



'నువ్వే ముఖ్యమంత్రివి, నువ్వే విద్యాశాఖ మంత్రివి.. అయినా మెస్ బిల్లులు, కాస్మొటిక్ చార్జీలు పెండిరగ్‌లో ఉన్నయ్. మరె ఇప్పుడు ఎవరి తోడ్కలు తియ్యాలె..?' అని ప్రశ్నించారు. చిల్లర మాటలు మాట్లాడుతూ విద్యార్థులకు సరిగా భోజనం పెట్టని సీఎం రేవంత్‌రెడ్డిని చెట్టుకు కట్టేసి, లాగులో తొండలు జొరగొట్టాలని హరీశ్‌రావు అన్నారు. రేవంత్‌రెడ్డి తోడ్కలు తీసే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు. కేసీఆర్ గంట ప్రెస్ మీట్ పెడితే.. సీఎంకు, కాంగ్రెస్ నేతలకు లాగులు తడుస్తున్నయని ఎద్దేవా చేశారు. రేవంత్ ప్రభుత్వ తీరుపై ప్రెస్‌మీట్‌లో కేసీఆర్ అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా రేవంత్‌రెడ్డి, ఆయన పార్టీ నేతలు సమాధానం చెప్పలేకపోయారని విమర్శించారు.



## మెథడిస్ట్ చర్చిలో కవిత ప్రత్యేక పూజలు
## ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు
## తెలిపిన జాగృతి అధ్యక్షురాలు

హైదరాబాద్ (డిసెంబరు 25)... తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినం సందర్భంగా ఆమె హైదరాబాద్ లోని నాంపల్లి చాపెల్ రోడ్డులో గల మెథడిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. తన చిన్ననాటి నుంచి మెథడిస్ట్ చర్చితో ఉన్న అనుబంధాన్ని కవిత గుర్తు చేసుకున్నారు.



# కాలిఫోర్నియాను ముంచెత్తిన భారీ వరదలు..

క్రిస్మస్ పండగ వేళ కాలిఫోర్నియాను భారీ వరదలు ముంచెత్తాయి. తుఫాను కారణంగా కుండపోతగా వర్షాలు కురిశాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ఇళ్లల్లోకి వరద నీరు ప్రవేశించింది. ఇక నీటి ప్రవాహానికి కార్లు కొట్టుకుపోయాయి. ఇక వరదలు కారణంగా క్రిస్మస్ సందడి కాస్త చప్పబడిపోయింది. ప్రజలంతా ఇళ్లకే పరిమితం అయిపోయారు. బుధవారం శక్తివంతమైన తుఫాను కారణంగా భారీ ఈదురుగాలులతో పాటు వర్షం కురిసిందని అధికారులు చెప్పారు. ఇక వరదలు కారణంగా ప్రధాన రహదారులను అధికారులు మూసేశారు. ఇక కొండచరియలు విరిగిపడడంతో సమీప ప్రాంతాలు బురదమయం అయ్యాయి. ఇక విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో పలు ప్రాంతాలు అంధకారంలో మునిగిపోయాయి. ఇక చెట్లు రోడ్లపై కూలిపోవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# ఫిబ్రవరిలో ఎన్నికలు.. అవామీ లీగ్‌పై నిషేధం

బంగ్లాదేశ్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలో అవామీ లీగ్ ఎన్నికల్లో పాల్గొనకుండా యూనిస్ ఖాన్ మధ్యంతర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు ఆ దేశ సమాచార ముఖ్య అధికారి షఫీకుల్ ఆలం పేర్కొన్నారు. అవామీ లీగ్ రాబోయే జాతీయ ఎన్నికలలో పోటీ చేయకుండా ఆ పార్టీపై నిషేధం విధించనట్టు తాత్కాలిక ప్రభుత్వ సలహా మండలి సమావేశం తరువాత జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో రాజకీయ అలజడి చేలరేగిన విషయం తెలిసిందే. విద్యార్థుల తీవ్రమైన నిరసనతో షేక్ హాసినా ప్రభుత్వం పడిపోయి దేశం విడిచి వెళ్లిపోయారు. ఆ తర్వాత యూనిస్ ఖాన్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం దేశపాలన పగ్గాలు చేపట్టింది. ఆ తర్వాత సజావుగా పాలన కొనసాగుతుండగా తీవ్రవాద విద్యార్థి నాయకుడు షరిప్ ఉస్మాన్ హాదీ హత్యతో మరోసారి ఆ దేశంలో ఉద్రిక్తతలు తలెత్తాతాయి.

# వెంటాడుతున్న మృత్యువు

వైద్య సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్న గాజా వాసుల విషయంలో ఇజ్రాయిల్ అమానుషంగా వ్యవహరిస్తోంది. వారిని మృత్యు ముఖంలోకి నెడుతోంది. గాజాలో ఆరోగ్య వ్యవస్థ అసాధారణ రీతిలో ఏ క్షణాన అయినా కుప్పకూలిపోయే ప్రమాదం తలెత్తింది. గాజాలోకి వైద్య పరికరాలు, మందులు ప్రవేశించకుండా ఇజ్రాయిల్ అడ్డుకుంటుండడంతో వేలాది మంది రోగులను మృత్యువు వెంటాడుతోంది. గాజాలోని ఆస్పత్రులలో పరిస్థితి దారుణంగా, భయానకంగా ఉన్నదని ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ మునీర్ అల్‌బర్ష్ తెలిపారు. అత్యవసర వైద్య సరఫరాలను ఇజ్రాయిల్ అడ్డుకుంటోందని, ఫలితంగా కీలక కేసులకు వైద్యులు చికిత్స అందించలేకపోతున్నారని ఆయన చెప్పారు. అత్యవసర మందులు, వైద్య పరికరాలను గాజాలోకి ఇజ్రాయిల్ అనుమతించకపోవడంతో రోగుల ప్రాణాలు కాపాడేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతున్నా యని గాజా వైద్యులు చాలాకాలంగా చెబుతూనే ఉన్నారు. అక్టోబరులో కాల్పుల విరమణ అమలు లోకి వచ్చినప్పటికీ హమాస్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘిస్తోంది. వైద్య సహాయక వాహనాలను గాజాలోకి ప్రవేశించని వ్వడం లేదు. గాజాలో ఇప్పటికే ఆరోగ్య ఎమర్జెన్సీ అమలులో ఉండగా ఇజ్రాయిల్ అమానవీయ చర్యలతో పరిస్థితి మరింత క్షీణిస్తోంది. మందులు, వైద్య సరఫరాల కొరత తీవ్రంగా ఉన్నదని, ముఖ్యం గా శస్త్రచికిత్సలు చేసేందుకు అవసరమైన సామగ్రి అందుబాటులో లేదని వైద్యులు చెబుతున్నారు. మూడు వంతుల సరఫరాలకు ఆటంకం కలుగు తోందని, దీనికి తోడు కరెంటు కష్టాలు, జనరేటర్ల కొరత వెంటాడుతోందని వారు తెలిపారు. 30 ఏండ్ల క్రితం పాలస్తీనా అథారిటీ ఏర్పడిన తర్వాత ఇంతటి ప్రమాదకర పరిస్థితి ఎన్నడూ ఎదురవలేదని మునీర్ అల్‌బర్ష్ చెప్పారు. రెండు సంవత్సరాలకు పైగా కొనసాగిన యుద్ధంలో దాదాపు గాజా ఆస్పత్రులన్నింటి పైన దాడులు జరిగాయి.

# మసీదులో బాంబు పేలుడు..
# 10 మంది మృతి!

పశ్చిమ ఆఫ్రికా దేశమైన నైజీరియాలో ఉగ్రవాదులు మరోసారి పంజా విసిరారు. బోర్నో రాష్ట్ర రాజధాని మైదుగురిలోని ఒక మసీదులో బుధవారం సాయంత్రం ప్రార్థనల సమయంలో భీకర బాంబు పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో కనీసం 10 మంది భక్తులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గంబోరు మార్కెట్ ప్రాంతంలోని రద్దీగా ఉండే మసీదులో ఈ పేలుడు సంభవించడంతో ఒక్కసారిగా హాహాకారాలు మిన్నంటాయి. సాయంత్రం వేళ ముస్లింలు పెద్ద సంఖ్యలో మసీదుకు చేరుకుని ప్రార్థనల్లో నిమగ్నమై ఉండగా ఈ పేలుడు జరిగింది. మసీదు లోపల ముందే అమర్చిన బాంబు పేలి ఉండవచ్చని లేదా ఆత్మాహుతి దాడి జరిగి ఉండవచ్చని స్థానిక మిలీషియా నాయకులు అనుమానిస్తున్నారు. పేలుడు ధాటికి మసీదు శిథిలాలు భక్తులపై పడటంతో పాటు దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగినట్లు సమాచారం. ఈ దాడులకు సంబంధించి ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత ప్రకటించనప్పటికీ, ఈ ప్రాంతంలో బలంగా ఉన్న 'బోకో హరామ్' లేదా ఐసిస్ గ్రూపుల పనే అయి ఉంటుందని భద్రతా సంస్థలు భావిస్తున్నాయి. 2009 నుంచి నైజీరియాలో ఇస్లామిక్ రాజ్య స్థాపన లక్ష్యంగా సాగుతున్న ఈ ఉగ్రవాద పోరులో ఇప్పటివరకు సుమారు 40 వేల మంది ప్రాణాలు కోల్పోగా, 20 లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు.



గత కొన్నేళ్లుగా మైదుగురి నగరంలో పెద్దగా దాడులు జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో మళ్లీ మసీదునే లక్ష్యంగా చేసుకుని దాడి జరగడం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది. నైజీరియా సైన్యం నిరంతర నిఘా పెట్టినప్పటికీ, ఉగ్రవాద గ్రూపులు ఇలాంటి విద్రోహ చర్యలకు పాల్పడుతుండటం అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది. ఐక్యరాజ్య సమితి గణాంకాల ప్రకారం, ఈ ప్రాంతంలో హింస తగ్గుముఖం పట్టినట్టే కనిపిస్తున్నా, పొరుగు దేశాలైన నైగర్, చాద్‌లకు కూడా ఈ ఉగ్రవాదం వ్యాపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

# పాలస్తీనా అనుకూల ప్రదర్శనలో..

## గ్రేటా థన్‌బర్గ్ అరెస్ట్.. విడుదల

లండన్‌లో మంగళవారం జరిగిన పాలస్తీనా అనుకూల ప్రదర్శనలో స్వీడన్ కార్యకర్త గ్రేటా థన్‌బర్గ్‌ను అరెస్ట్ చేశారు. అయితే ఆ తర్వాత ఆమెను కస్టడీ నుంచి పోలీసులు విడుదల చేశారు. 'నేను పాలస్తీనా యాక్షన్ ఖైదీలకు మద్దతు ఇస్తున్నాను. స్తున్న పాలస్తీనా అనుకూల ప్రత్యక్ష కార్యాచరణ నెట్‌వర్క్. దీనిని 2020లో ఏర్పాటు చేశారు. గాజాపై ఇజ్రాయిల్ జరిపిన యుద్ధ సమయంలో బ్రిటన్‌లో అనేక నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. ఈ నెట్‌వర్క్‌కు చెందిన 2,489 మందిని వివిధ కారణాలతో పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రేటా థన్‌బర్గ్‌కు మార్చి వరకూ బెయిల్ ఇచ్చామని లండన్ నగర పోలీసులు తెలిపారు. నిషేధిత సంస్థకు మద్దతుగా ప్లకార్డు ధరించడంతో ఆమెను అరెస్ట్ చేశామని చెప్పారు. పోలీసులు నిర్బంధించిన కార్యకర్తలకు మద్దతుగా ప్రిజనర్స్ ఫర్ పాలస్తీనా సంస్థ నిరాహార దీక్షలు ప్రారంభించింది. 2018లో స్వీడన్ పార్లమెంట్ ఎదుట వాతావరణ సంబంధమైన నిరసనలు జరపడంతో 22 సంవత్సరాల గ్రేటా థన్‌బర్గ్ వార్తల్లోకి ఎక్కారు. ఆమెను మరో 478 మందితో కలిసి అక్టోబరులో నిర్బంధించిన ఇజ్రాయిల్ వారందరినీ దేశం నుంచి బహిష్కరించింది.




# వెనిజులాపై అమెరికా దాడులు..

## ఖండించిన రష్యా


వెనిజులాపై అమెరికా దురాక్రమణపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యుఎన్ఎస్‌సి) మంగళవారం చర్చ చేపట్టింది. ఈ సమావేశంలో అమెరికా 'అక్రమ దిగ్బంధనం'ను రష్యా ఖండించింది. ఇది ప్రాంతీయ శాంతికి ముప్పు కలిగించడమే కాకుండా అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తోందని పేర్కొంది. డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవాలనే తప్పుడు సాకుతో అమెరికా కరేబియన్ జలాల్లో పౌర నౌకలను ధ్వంసం చేస్తోందని యుఎన్‌లో రష్యా శాశ్వత ప్రతినిధి వాసిలీ నెబెంజియా ఆ సెషన్‌లో పేర్కొన్నారు. ఇది 'కృత్రిమమైనది'గా పేర్కొంటూ .. 'వెనిజులాకు వ్యతిరేకంగా ఉద్రిక్తతలను పెంచడానికి ఉద్దేశించిన సమర్థన' అని వ్యాఖ్యానించారు. వెనిజులాలో చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని ఉగ్రవాద సంస్థగా ముద్రవేయడం ద్వారా అమెరికా ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ఒక సాకుగా ఉగ్రవాదంపై పోరాటాన్ని వినియోగిస్తూ, దానిని నిర్వీర్యం చేస్తోందని అన్నారు. ఏకపక్ష యుఎస్ నిర్ణయం, దాని చర్యలను చట్టబద్ధమైన చట్ట అమలు లేదా జాతీయ రక్షణ కార్యకలాపాలుగా మారుస్తుందనే వాదనను ఆయన తిరస్కరించారు. డిసెంబర్ 16న ట్రంప్ ప్రకటనను ప్రాథమిక నిబంధనల ఉల్లంఘనకు స్పష్టమైన సాక్ష్యంగా ఆయన ఉదహరించారు. దీనికి మరిన్ని వివరణలు అవసరం లేదని అన్నారు. రాజకీయ, సైనిక మరియు ఆర్థిక ఒత్తిడిని ప్రయోగించి వ్యతిరేక దేశాల ప్రభుత్వాలను పడగొట్టడం వెనుక ప్రధాన లక్ష్యం ఆయా దేశాల సహజ మరియు ఖనిజవనరులను స్వాధీనం చేసుకోవడమేనని అన్నారు. అమెరికా చర్యలు పూర్తిగా ఆమోదయోగ్యం కానివి అని, యుఎన్, ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టంపై సమావేశం (యుఎన్‌సిఎల్ఓఎస్), భద్రతామండలి తీర్మానాలకు విరుద్ధని ఆయన పేర్కొన్నారు. వెనిజులా ప్రభుత్వానికి, ప్రజలకు రష్యా పూర్తి సంఘీభావం ప్రకటిస్తుందని అన్నారు. ఆయనను జాతీయ సార్వభౌమాధికార రక్షకుడిగా అభివర్ణించారు. అంతర్జాతీయ సమాజం అంతర్జాతీయ చట్టాలను సమర్థించాలని ఆయన కోరారు.



# తమిళనాడులో రోడ్డు ప్రమా

## సంతాపం తెలిపిన సీఎం స్టాలిన్

చెన్నై: తమిళనాడులోని కడలూరు జిల్లా తిట్టకుడి సమీపంలోని ఏల్తూరు గ్రామం వద్ద తిరుచ్చిచెన్నై జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తిరుచ్చి నుంచి చెన్నై వెళ్తున్న ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సు ముందు టైర్ పేలడంతో అదుపు తప్పి మీడియన్‌ను దాటి ఎదురుగా వస్తున్న ఒక ఎస్‌యూవీ, ఒక కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లలో ప్రయాణిస్తున్న 7 మంది సహా మొత్తం 9 మంది స్పాట్‌లోనే మృతి చెందారు. ఇద్దరు పిల్లలు సహా మరో నలుగురు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు తలా రూ.3 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. గాయపడిన వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896